
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఏలూరు
జిల్లా వార్తలు
5
ఆదివారం 21 ఏప్రిల్ 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 43.0
కనిష్ఠం : 26.0



సరుకు దిగింది..

కావాల్సిన వారికి.. కావాల్సినంత కిక్



- రహస్య ప్రాంతాల్లో ఎక్కడికక్కడ మద్యం నిల్వలు
- మూడు నెలలుగా ఎక్కడ దొరికితే అక్కడి నుంచి సేకరణ
- సర్కారు దుకాణాల నుంచే అత్యధికంగా డంప్
- వైసీపీలో అనుకూలురుకి ఎక్కువ అందుబాటు..

ఎన్నికలు వచ్చాయంటే చాలు కార్యకర్తలు దగ్గర నుంచి సామాన్య ఓటరు వరకు ఫుల్ ఖుష్.. నేతలు వెంట జై జైలు కొడుతూ వీధుల్లో పార్టీల నినాదాలు చేస్తూ వచ్చి పోయే వారిని తమ నేతకు అనుకూలంగా ఓట్లు అడుగుతూ ఫుల్ బిజీగా ఉండే కార్యకర్తలకు ఇంతకుముందు అయితే పోటీ చేసే అభ్యర్థి అంతా చూసుకునేవారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నేతలకు జేబు నిండా పని తగిలేది. ఇప్పుడు ఆ పరిస్థితి ఉన్నా గుర్తించిన వారికి మాత్రమే. 'జే' మార్కుతో గొంతు తడపడం లేదంటే జేబు నింపడం ఈ రెండే లక్ష్యాలుగా ఈ సారి ఎన్నికల కథ నడుస్తోంది.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

గోదావరి జిల్లాల్లో ఎన్నికల సమయంలో అందరికి ఓటు పండగే. పోటీ చేసే అభ్యర్థులు ఎవరికి కొదువ లేకుండా చూసుకుంటేనే అసలు సిసలైన ఫలితం. దీనికోసమే ఎంతైనా ఇస్తారు. ఈ ఐదేళ్ల పాటు 'జే' మార్కు మద్యంతో జనం తిప్పలు పడ్డారు. ఎక్కడా అమ్మకాలు జోరు తగ్గనేలేదు. దేశంలో ఎక్కడా వినిపించని, కనిపించని రకరకాల బ్రాండ్‌లు అన్ని సర్కారు దుకాణాల్లో దర్శనం ఇచ్చాయి. మద్యం ఏమాత్రం నాణ్యత లేదని విమర్శలు వెల్లువెత్తినా అమ్మకాలు ఆగలేదు. బ్రాండ్‌లు మార్చలేదు. ఇదే పనిగా చీప్ లిక్కర్ కూడా దాదాపు అన్ని చోట్ల యథావిధిగానే అమ్మకాలు సాగాయి. ఇప్పటికే అవే బ్రాండ్‌లను గడిచిన మూడు నెలలుగా దఫదఫాలుగా సేకరిస్తూ వచ్చారు. అధికార వైసీపీ వర్గానికి చెందిన మద్యం ఎత్తుగడ వేరే. ఎవరికి అనుమానం కలగకుండా కొంచెం కొంచెం ఆ తర్వాత ఇంకొంచెం పెంచి స్టాక్‌ను మండలాల వారీగా తమకు అనుకూల నేతలు గృహాల్లో, చేపలు చెరువుల పాకల వద్ద, కొందరు సామాన్య కార్యకర్తల ఇళ్లల్లోనూ దాచేశారంటూ ఇప్పటికే ప్రచారం గుప్పుమంటోంది. ప్రత్యేకించి ఈ ఎన్నికల వేళ తమ వెంట నడిచేవారిలో అత్యధికులకు క్వార్టర్ + 500 చేతిలో పెడుతూ జెండాలు పట్టించి బలనిరూపన చేస్తున్నారు. డెల్టా ప్రాంతంలో ఈజోష్ ఎక్కువగా ఉంది. ఏలూరు జిల్లా ప్రాంతాల్లో వీలైనంత మేర మద్యంను ఎక్కడికక్కడ నిల్వ చేసేందుకు ప్రయత్నించారు.

ఒక్కొక్క నియోజకవర్గానికి అరకోటి పైనే..

అయా నియోజకవర్గంల్లో ప్రధాన పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులు ఇప్పటికే మద్యం నిల్వలకు పాల్పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఎందుకంటే ఎప్పుడూ మాదిరిగానే తొలి విడతలోనే ఎన్నికలు పూర్తవుతాయని భావించి ఆ మేరకు టిక్కెట్ ఖాయమనుకున్నవారంతా షెడ్యూలుకు ముందే 'ముందు జాగ్రత్త'లు తీసుకున్నారు. ఎక్కడా కాలు కదపకుండా మద్యం దుకాణాల్లోనే ఏరోజు కారోజు తక్కువ మొత్తంలో క్వార్టర్ బాటిళ్లను నిల్వ చేస్తూ వచ్చారు. ఎవరికి అనుమానం రాకుండా మండల స్థాయి నేతలు ఎక్కడికక్కడ సరి చేసుకునేలా జాగ్రత్త పడినట్టు ఆరోపణలు లేకపోలేదు. ఈ క్రమంలోనే ఖమ్మం సరిహద్దున, తెలంగాణ ప్రాంతాల్లోనూ అధికారులు నిఘా ఉంచినా చీకటి మాటున వ్యవహారం సరిపెట్టారు. చింతలపూడి నియోజకవర్గానికి ఖమ్మం జిల్లా నుంచి ఎటువంటి ఆధారాలు లేకుండా రశీదులు లేకుం డా వచ్చిన మద్యం వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం మద్యం దుకాణానికి సంబంధించిన సరుకుగా అప్పట్లో వదంతులు వినిపించాయి. అవి నిజమో కాదో తెలియక ఆ వ్యవహారం ముగిసింది. ఇంకోవైపు నూజివీడు ప్రాంతా ల్లోనూ ఈ తరహా మద్యం భారీ ఎత్తున సరిహద్దును దాటుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితిని గమనించి ఎస్‌ఈబీ అధికారులు నియోజక వర్గాల్లో తరచూ దాడులు నిర్వహించారు. ఇంత చేస్తున్న సరే మా సరుకు మాకు వచ్చేసింది.. అంటూ కొందరు నేతలు ఇప్పటికే సంతృప్తిగా ఉన్నారు. మే 13న పోలింగ్ జరగనున్నందున అప్పటికి అవసరమైన సరుకును గ్రామాలు వారీగా తరలిస్తారని చెబుతున్నారు. ఈసారి ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఇప్పుడిప్పుడే నేతలు కొందరు విలక్షణ వేషాలకు దిగుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాలో ఓటర్ల ఆకర్షించడానికి శ్రీరామ నవమి రోజున కొందరు పుచ్చకాయలు, కూల్‌డ్రింక్‌లు ఎలా పంపిణీ చేశారో ఆ తరహాలోనే పోలింగ్‌కు ముందు నాడు ఓటర్లకు ప్రత్యేకించి తమ అయిన వారికి, పార్టీకి అత్యంత ఇష్టులకు పంపించేలా మద్యం అందించబోతున్నట్టు చెబుతున్నారు. ఈ లెక్కన ప్రతీ నియోజకవర్గంలో ఒక్క అభ్యర్థి 25 నుంచి 45 లక్షలు మేర ఒక్క మద్యం నిల్వలకే బడ్జెట్ పెట్టుకున్నట్టు ఇప్పటికే గుప్పుమంటోంది. సాధారణంగా కొన్నివర్గాల వారికి ప్రచారంలోనూ, ఆఖరికి పోలింగ్ కౌంటింగ్ రోజున కిక్ ఉండాల్సిందే. ఈ తరహా పద్ధతి అనుసరించడానికి అన్ని పార్టీ అభ్యర్థులు ముందుకు దూకుతున్నారు.

మూడోరోజు తొమ్మిది నామినేషన్లు

ఏలూరు సిటీ/ఉంగుటూరు/ఏలూరు రూరల్/కైక లూరు/ నూజి వీడు టౌన్/ పోలవరం/చింతలపూడి, ఏప్రిల్ 20 : జిల్లాలో శనివారం మూడోరోజున అసెంబ్లీ నియోజక వర్గాలకు తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి.

- ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పుట్టా కుమార్ ఆర్వో ఖాజా వలికి అందజేశారు.
- ఏలూరు అసెంబ్లీ నియోజక వర్గం నుంచి జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా ములగల జోషి నామినేషన్ వేశారు.
- కైకలూరు నియోజకవర్గానికి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా లావేటి వీరశివాజీ రిటర్నింగ్ కె.భాస్కర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు.
- నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గానికి రీఫామ్స్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున పాము రవీంద్రనాథ్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆర్డీవో వై.భవానిశంకరికు నామినేషన్లు అందించారు.
- పోలవరం గోండ్వాడా దండకారణ్య పార్టీ అభ్యర్థిగా మడకం వెంకటేశ్వరరావు నామినేషన్ వేశారు.
- చింతలపూడి వైసీపీ అభ్యర్థిగా కంభం విజయరాజు, ఆయనకు డమ్మీగా కంభం శామ్యూల్ ప్రణయ్, స్వతంత్ర అభ్యర్థిగా వెంపా దుర్గారావు రిటర్నింగ్ అధికారి కె.అద్దయ్యకు నామినేషన్లు అందించారు.
- దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గానికి మూడోరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఏలూరు ఎంపీ స్థానానికి కూడా నామినేషన్‌లు పడలేదు. గత మూడు రోజుల్లో జిల్లాలో అసెంబ్లీ స్థానాలకు 21, ఏలూరు ఎంపీ స్థానానికి 3 మొత్తం 24 నామినేషన్లు దాఖలయ్యాయి.

నామినేషన్ కౌంటర్

3వ రోజు

ఎంపీ/ఎమ్మెల్యే నియోజకర్గాలు	మూడో రోజు నామినేషన్లు	మొత్తం
ఏలూరు ఎంపీ	00	03
1.ఉంగుటూరు	01	02
2.దెందులూరు	00	02
3.ఏలూరు	01	02
4.పోలవరం	01	03
5.చింతలపూడి	03	03
6.నూజివీడు	02	05
7.కైకలూరు	01	04
మొత్తం	09	21
నరసాపురం ఎంపీ	01	06
1.ఆచంట	00	04
2.పాలకొల్లు	01	05
3.నరసాపురం	00	02
4.భీమవరం	00	01
5.ఉండి	00	04
6.తణుకు	02	06
7.తాడేపల్లిగూడెం	01	03
మొత్తం	04	25

26న షర్మిల దెందులూరు రాక

దెందులూరు, ఏప్రిల్ 20 : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 26వ తేదీన దెందులూరు రానున్నారు. ఆ పార్టీ దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆలపాటి నరసింహమూర్తికి మద్దతుగా ప్రచారం చేయనున్నారు. ఈ విషయాన్ని శనివారం దెందులూరులో ప్రచారం నిర్వహించిన నరసింహమూర్తి తెలిపారు.



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మేరి ప్రశాంతి

నిబంధనలు పాటించాలి : ఎస్పీ

కొయ్యలగూడెం, ఏప్రిల్ 20 : ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్‌లో పోలవరం సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో సమావేశం అయ్యారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వారి ప్రచార కార్యక్రమాలకు 18 ఏళ్లలోపు పిల్లల్ని వినియోగించ కూడదన్నారు. పోలీస్ అధికారులు నిత్యం గ్రామాల్లో సందర్శించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజా సమస్యల్ని పరిష్కరించాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. డీఎస్పీ సురేష్‌కుమార్‌రెడ్డి, ఏటీ సీఐ మల్లేశ్వరావు, కుక్కునూరు సీఐ శ్రీనివాసరావు, పోలవరం సీఐ మధుబాబు, కొయ్యలగూడెం డివిజన్‌లో ఎస్‌ఐలు ఉన్నారు.

368 సీ-విజిల్ ఫిర్యాదులు పరిష్కారం : కలెక్టర్

ఏలూరు సిటీ, ఏప్రిల్ 20 : జిల్లాలో మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇప్పటి వరకు 24 నామినేషన్లు దాఖలైనట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా మొత్తంగా రూ. 13.45 కోట్లు విలువైన నగదు, బంగారం, వెండి, మంద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామన్నారు. ఇందులో రూ. 195.20 లక్షలు నగదు, రూ. 10.17 కోట్లు విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.128.86 లక్షల విలువైన మద్యం స్వాధీన పరచుకున్నామన్నారు. ఇంతవరకు 1,781 సువిధ / ఎన్‌కోర్ అభ్యర్థనలకు అనుమతులు ఇచ్చామన్నారు. సీ-విజిల్ ద్వారా 368 ఫిర్యాదులను, మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 99 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ఎన్‌జి ఎస్పీ పోర్టల్ ద్వారా 600 ఫిర్యాదులు స్వీకరించగా వాటిలో 597 పరిష్కరించారని, మరో 3 పరిశీలనలో ఉన్నాయన్నారు. జిల్లాలోని ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఈ ఎన్నికలలో 85 ఏళ్ల నిండిన సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, సర్వీస్ ఓటర్లు, ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బంది, ఇతర ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఎన్నికల విధులకు హాజరయ్యే డ్రైవర్లు, కండక్టర్లు, క్లీనర్లు, అత్యవసర సేవలు అందించే 33 శాఖలకు చెందిన సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ , ఈటీపీబీఎస్(సర్వీస్ ఓటర్లు) , హోం ఓటింగ్ ద్వారా ప్రత్యేక సౌకర్యం కల్పించారన్నారు.

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్ ఇంటికే..

- రానున్నది కూటమి ప్రభుత్వమే..
- ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్

కామవరపుకోట, ఏప్రిల్ 20 : అభివృద్ధి పథంలో ఉన్న రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టి భ్రష్టు పట్టించిన సీఎం జగన్ వచ్చే ఎన్నికల్లో ఇంటి బాట పట్టడం ఖాయమని, కూటమి ప్రభుత్వాలే ఏర్పడతాయని ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి సొంగా రోషన్ కుమార్ పేర్కొన్నారు. కామవరపుకోట పంచాయతీ పాతూరులో శనివారం జరిగిన కూటమి సమన్వయ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖుల సమక్షంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు, పంచాయతీ మాజీ వైస్ సర్పంచ్‌గా పనిచేసిన ఘంటా సత్యంబాబు 200 కుటుంబాలతో టీడీపీలో చేరారు. వీరికి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సత్యంబాబు బృందాన్ని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జగ్గవరపు ముత్తారెడ్డి, జుజ్జూరి బాబ్జీ, మురళి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తూతా లక్ష్మణరావు, పసుమర్తి పార్థసారథి బాబు, గోరింకదాసు, గూడపాటి కేశవరావు, బేతిన వెంకట్రావు, ఘంటా సుధీర్, వేముల నాగేశ్వరరావు, కంఠమనేని సత్యనారాయణ, అంజిమూర్తి, పుష్ప రాజ్యం, మురళి, పలు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు, భారీ కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలను టీడీపీ ఆధ్వర్యంలో జరిపారు.



ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గన్ని, చింతమనేని, మురళి సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాయకులు



సమావేశంలో విజయం మనదేనంటూ కార్యకర్తలను ఉత్సాహపరుస్తున్న ఎంపీ అభ్యర్థి మహేష్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి రోషన్ కుమార్

విద్యా సంవత్సరం ముగింపు దశలో..

టీచర్ల నెత్తిన కొత్త భారం

- విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు
- ఇక మార్కుల స్థానే మూడు గ్రేడుల్లో మదింపు
- సాంకేతిక అడ్డంకులు, నెట్ సెంటర్లకు టీచర్ల పరుగులు
- 23నే జిల్లాలో 1.25 లక్షల మందికి కార్డులివ్వాలట!

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20 : మరో మూడురోజుల్లో విద్యాసంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఉపాధ్యాయులనెత్తిన 'హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు'ల రూపంలో పాఠశాల విద్యాశాఖ మరో పనిభారాన్ని మోపి ఒత్తిడికి గురి చేస్తుండడంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. విద్యాసంవత్సరం ముగింపురోజున ఆ ఏడాదిలో నిర్వహించిన అన్ని పరీక్షల్లో విద్యార్థి సాధించిన మార్కులు, సగటు గ్రేడులతో కూడిన ప్రోగ్రెస్ కార్డులను ఏటా ఇవ్వడం పరిపాటిగా వస్తోంది. ఇప్పుడు ఈ విధానానికి స్వస్తి పలికిన విద్యాశాఖ పాఠశాలలు వేసవి సెలవుల నిమిత్తం మూసివేస్తున్న వేళ హడావుడిగా హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల విధానాన్ని అమల్లోకి తెచ్చింది. నూతన విధానం ప్రకారమే ప్రోగ్రెస్ కార్డులను తయారుచేసి, వాటిలో ఆ ఏడాది నిర్వహించిన నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ పరీక్షల్లో బాలబాలికలు సాధించిన మార్కులను సబ్జెక్టు వారీగా నమోదు చేయడంతో పాటు, వాటి సగటును లెక్కించి విద్యార్థి ప్రగతిని గ్రేడుల రూపంలో ఇవ్వాలని ఆదేశించడం ఉపాధ్యాయ వర్గాలను గందరగోళంలో పడేసింది. మరోవైపు నూతన విధానం ప్రకారం విద్యాశాఖ వెబ్‌సైట్‌లో మార్కులను అప్‌లోడ్ చేయడానికి ప్రయత్నిస్తుండగా ఒకసారి మార్కులను నమోదు చేసిన విద్యార్థి పేర్లనే మరోసారి వెబ్‌సైట్‌లో చూపిస్తూ మార్కులను మళ్లీ నమోదు చేయాలని సూచిస్తుండటం టీచర్లను చికాకు పెడుతోంది. ఇక కంప్యూటర్, ప్రింటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లేని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులైతే విద్యార్థుల మార్కులు, సగటులను లెక్కించుకుని వాటికి గ్రేడులను నిర్ధారించుకున్న అనంతరం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడానికి ఇంటర్నెట్ సెంటర్లను ఆశ్రయించాల్సి రావడం, నమోదుకయ్యే ఖర్చులను సొంతంగా భరించాల్సి రావడం క్షేత్రస్థాయిలో మరిన్ని సమస్యలకు కారణమవుతోంది. వీటన్నింటినీ పట్టించుకోని విద్యాశాఖ ఈనెల 23న నూత నంగా రూపొందించిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ రిపోర్టులనే విద్యార్థులకు ఇచ్చితీరాలని ఒత్తిడికి గురి చేస్తుండటం విమర్శలపాలవుతోంది.

ఏంటీ హోలిస్టిక్ ప్రోగ్రెస్?

విద్యార్థి చదివిన తరగతిలో ఏడాది కాలంలో నిర్వహించిన అన్ని పరీక్షల్లో సాధించిన మార్కులను లెక్కించి వాటి సగటును తీసుకుని గ్రేడులు ఇవ్వడమే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల ప్రత్యేకత. ఆ ప్రకారం సంబంధిత సబ్జెక్టులో 35 లోపు మార్కులు సాధిస్తే 'స్ట్రీమ్' (బిలో ఏవరేజ్), 35-60 మార్కులు సాధిస్తే 'మౌంటేన్' (ఎబోవ్ ఏవరేజ్), 60 మార్కులు పైబడి సాధిస్తే 'స్కై' (ఎక్స్‌లెంట్)గా నిర్ధారిస్తూ గ్రేడులను మాత్రమే ప్రోగ్రెస్ కార్డులో నమోదు చేస్తారు. దీంతోపాటే విద్యార్థి హాజరు 75శాతం లోపునకు, 75-90 శాతానికి, 90 శాతం పైబడి హాజరుకు ఇదే మాదిరిగా మూడురకాల గ్రేడులను ఇవ్వాల్సి ఉంటుంది. నూతన విధానం మేరకే ప్రోగ్రెస్ కార్డులను తయారు చేయడంతో పాటు, అన్ని పరీక్షల మార్కులను వెబ్‌సైట్‌లో అప్ లోడ్‌చేసి, సబ్జెక్టుల వారీగా మార్కుల సగటును లెక్కించి వాటికి సీబీఎస్‌ఈ పద్ధతిన విద్యార్థి ప్రగతిని గుర్తించి గ్రేడులను ఇవ్వాలని, ఆ ప్రకారమే ప్రోగ్రెస్ కార్డుల హార్డ్‌కాపీల ప్రింటవుట్‌లను తీసుకుని ఈ నెల 23న విద్యార్థులకు ఇవ్వాలని సూచించింది. జిల్లాలో ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు మొత్తం 1,810 ప్రభుత్వ పాఠశాలల్లో 1,25,521 మంది బాలబాలికలు చదువుతున్నారు. నూతన ప్రోగ్రెస్ కార్డుల విధానాన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలన్నింటిలో అమలు చేయాల్సి వస్తే మొత్తం 2,40,576 మంది విద్యా ర్థులకు ఇవ్వాల్సిఉంటుంది. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండే హైస్కూళ్లలో టీచర్లకు నూతన ప్రోగ్రెస్ కార్డుల విధానం ఓ గుదిబండలా భావిస్తున్నారు. దీనిపై విద్యాశాఖవర్గాలను వివరణ కోరగా..' సీబీఎస్‌ఈ విధానంలో ప్రోగ్రెస్ కార్డులను తయారు చేయాలని ఆదేశాలు అందాయి. అయితే మార్కులను నమోదు చేస్తున్నప్పటికీ నమోదు కాలేదని వెబ్‌సైట్‌లో చూపిస్తున్నట్టుగా మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపాం. ఈ సమస్య ఆదివారానికి పరిష్కారమవుతుందని భావిస్తున్నాం. 23న హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు విద్యార్థులకు ఇచ్చేలా సూచించాం.' అని వివరించాయి.

అదనపు పరిహారం ఏదీ..?



గత ఎన్నికల సమయంలో జగన్ ప్రతిపక్ష హోదాలో పర్యటించినప్పుడు మన ప్రభుత్వం రాగానే నిర్వాసితులకు అదనపు పరిహారం అన్నారు. గతంలో తన తండ్రి ఇచ్చిన ఎకరాకు రు.1.15 లక్షల పరిహారానికి అదనంగా రూ.3.50 లక్షలు ఇస్తానన్నారు. ఐదేళ్లు గడిచినా హామీ అమలు కాలేదు.

సమస్యలు.. హామీలు

- కొయ్యలగూడెం మండలంలో డిగ్రీ కాలేజీ, ఫైర్ స్టేషన్ ఏర్పాటు ఎన్నికల హామీలుగానే మిగిలాయి.
- కొయ్యలగూడెం - కన్నాపురం, పొంగుటూరు - యర్నగూడెం రహదారులు అధ్వానం. కన్నాపురం - పోలవరం వెళ్ళే రహదారిలో తూర్పుకాల్వ, కన్నాపురం - బుట్టాయిగూడెం రహదారిలోని పడమటి కాల్వపై వంతెన లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం, వరదల సమయంలో ప్రయాణాలు నిలిచిపోవాల్సిందే.
- కొయ్యలగూడెంలో మార్కెట్ కమిటీ గోదాములు శిథిలావస్థకు చేరాయి. రైతులకు కనీస సౌకర్యాలు లేవు. తుప్పలు, ముళ్ళచెట్లతో మార్కెట్‌యార్డు నిండిపోవడంతో పాములకు నిలయంఆ మార్కెట్ యార్డు తయారైంది.
- కుక్కునూరు - భద్రాచలం 40 కి.మీ రహదారి అధ్వానంగా మారింది. రెండేళ్లుగా మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు నరకయాతన పడుతున్నారు.
- రెవెన్యూ వెబ్ ల్యాండ్ ఓపెన్ చేయక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారసత్వ భూముల పంపిణీ, అమ్మకాలు నిలిచి పోయాయి. ముంపులో లేని భూములకు వారసత్వ మ్యుటేషన్ జరగక పోవడంతో బ్యాంక్ రుణాలు అందని పరిస్థితి ఏర్పడింది.
- పోలవరం - గుంజవరం, వింజరం తానాలకుంట - ముత్యాలరావుపేట, దొండపూడి - పేద్రాల రహదారుల నిర్మాణ హామీ అమలు కాలేదు.

నెక్లెస్ బండ్.. శాపం

పోలవరం గ్రామానికి రక్షణగా నిర్మించిన నెక్లెస్ బండ్ ప్రణాళిక అధికారుల అంచనా వ్యయం రూ.12 కోట్లు కాగా ఇప్పటి వరకు 14 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారు. పనులు మాత్రం పూర్తి కాలేదు. 3.5 కిలో మీటర్ల మేర నెక్లెస్ బండ్ చేపట్టాలి. కేవలం 1.5 కిలోమీటర్లు పనులు చేశారు. వరదల సీజనుకి పోలవరం ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవలసిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెక్లెస్ బండ్, స్పిల్‌వే నిర్మాణంతో గోదావరి తీరం వైపు ఇసుక తిన్నెలు కొట్టుకుపోయి లంక భూములు కొట్టుకుపోయి నది రేవులు ప్రమాదకరంగా మారాయి.

- గుంజవరం - ఇటుకలకోట మార్గంలో కల్వర్టు, తానాలకుంట కల్వర్టు కొండవాగుల ధాటికి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారాయి. కనీసం మరమ్మతు కూడా చేయలేదు. ఎల్ఎన్‌డీ పేట పంచాయతీ సరిపల్లికుంట, రామనరసాపురం మార్గంలో కొట్టుకుపోయిన 3 కల్వర్టులు, వింజరం నుంచి మెత్తప్పకోట, సున్నాలగండి, ఉడతపల్లి గ్రామాలకు వెళ్ళే రోడ్డు మార్గంలో రెండు కల్వర్టుల నిర్మాణంలో బినామీ కాంట్రాక్టులతో వైసీపీ నేత సొమ్ములు స్వాహా చేశారని ఆరోపణలు.
- గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ఎల్ఎన్‌డీపేట పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానం కావడంతో మురుగు రోడ్లపై చేరుతోంది.
- జీలుగుమిల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.5 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణం తలపెట్టారు. వైసీపీ అధికారంలోకి రాగా స్టేడియం నిర్మాణం నిలిచిపోయింది.
- జీలుగుమిల్లి - పి.రాజవరం రహదారి అధ్వానం కావడంతో టి.నరసాపురం, చింతలపూడి, ఏలూరు వాహన చోదకులు నరకయాతన పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికి జీలుగుమిల్లి వాగు పొంగి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇటీవల కొద్ది మీటర్ల సీసీ రోడ్డు నిర్మించారు.
- జీలుగుమిల్లిలో పోలీస్ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. కార్యాలయం నిర్వహణకు తగిన భవనం లేక ఏడాది క్రితం పాడైన పారెస్టు శాఖ క్వార్టర్‌ను మరమ్మతు చేసి కార్యాలయంగా వాడుతున్నారు.
- బుట్టాయగూడెం మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దొరమామిడి పీహెచ్‌సీ భవన నిర్మాణాలు నిలిచిపోయాయి.

రూ. 10 లక్షల పరిహారం?

ప్రతి నిర్వాసితుడికి కేంద్రంతో సంబంధం లేకుండా పునరావాస పరిహారం రూ.10 లక్షలు ఇస్తామని జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక కేంద్రం నిధులు ఇస్తేనే పరిహారం చెల్లిస్తామని.. అంతా దేవుని దయ అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంతో ముంపు గ్రామాల్లో పిల్లలకు పెళ్లిళ్లు చేయలేకపోతున్నారు. పరిహారం రాగానే సొమ్ము ఇస్తామని పలువురు ఆడపిల్లల వివాహాలు చేశారు. కాలం గడుస్తున్నా పరిహారం అందక కుటుంబాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. చదువుకున్న వారు గ్రామం విడిచి వెళితే పరిహారం అర్హత కోల్పోతామని కూలీలయ్యారు.



కివ్వాక పునరావాస కాలనీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విస్తీర్ణంలో అతి పెద్ద నియోజకవర్గం పోలవరం. బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం, పోలవరం మండలాలతో పాటు తెలంగాణ నుంచి ఏపీలో విలీనమైన వేలేరుపాడు, కుక్కునూరు మొత్తం 7 మండలాలతో అతి పెద్ద నియోజకవర్గం. సమస్యలు కూడా అధికం. ప్రతిపక్ష నాయకుడిగా జగన్ ఇచ్చిన హామీలు అత్యంత ఘనం. ముంపు గ్రామాల నిర్వాసితులు గంపెడాశతో ఐదేళ్లు ఎదురు చూశారు. సీఎంగా జగన్ అతి పెద్ద మోసం చేశారని పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కునూరు, కొయ్యలగూడెం, పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి



కొత్త మామిడిగొంది నిర్వాసిత కాలనీ



పరిహారం ఇవ్వలేదు.. పునరావాసం పూర్తి కాలేదు..

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కుక్కునూరు మండల ప్రజలకు శాపంగా మారింది. ప్రాజెక్ట్ నిర్మాణంతో నిర్వాసితులైన వారికి వ్యక్తిగత పునరావాస పరిహారం, కోల్పోతున్న ఇళ్లకు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. 41.15 కాంటూర్ లెవల్‌లో మండలంలో 8 గ్రామాలు ముంపు బారిన పడతాయని ప్రభుత్వం గుర్తించింది. భువనగిరి, గుంపెనపల్లి, గొమ్ముగూడెం నిర్వాసితులకు పునరావాస వ్యక్తిగత పరిహారం చెల్లించారు. చీరవల్లిలో 400కి పైగా నిర్వాసితులు ఉండగా ఇప్పటికి దాదాపుగా 200 మంది నిర్వాసితులకు మాత్రమే పరిహారం చెల్లించారు. కుక్కునూరు ఎ బ్లాక్, కివ్వాక, దామరచర్ల, రామచంద్రపురం నిర్వాసితులకు పరిహారం అందలేదు. నెలలు, ఏళ్ళు గడుస్తున్నా పరిహారం మాత్రం నేటికీ అందటం లేదు.

ఇప్పటి వరకు పలు గ్రామాల్లోని గిరిజనేతర నిర్వాసితులకు రూ.6.36 లక్షలు ఎస్సీ, గిరిజనులకు రూ.6.86 లక్షలు చొప్పున ఖాతాలో జమ చేశారు. ఏటా గోదావరి వరదలకు గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయి. అటు పరిహారం అందక.. ఇటు సౌకర్యాల లేమితో దయనీయంగా జీవితం గడుపుతున్నామని కుక్కునూరు ఎ బ్లాక్ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తూరు గిరిజన నిర్వాసితుల ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. కట్టుకునే పరిస్థితి లేనందున వారి కోసం మర్రిపాడులో పునరావాస కాలనీలో ఇళ్లు కేటాయించాలని 60 కుటుంబాల గిరిజనులు కోరుతున్నారు.

జీలుగుమిల్లి మండలంలో పోలవరం నిర్వాసితులకు నిర్మించిన పునరావాస కాలనీల్లో కనీస సదుపాయాలు కల్పించలేదు. ముంపు పేరుతో స్వగ్రామాల నుంచి బలవంతంగా పునరావాస కాలనీలకు తరలించారు. కామయ్యపాలెం పంచాయతీ వద్ద కొత్తమామిడిగొంది గ్రామస్తులు సుమారు 50 కుటుంబాలు వచ్చాయి. హామీల అమలు ఎలా ఉన్నా కనీస వసతులు లేవు తాగునీరు లేదు, కనీసం చేతి పంపులు కూడా ఏర్పాటు చేయలేదు. కొందరికి ప్యాకేజీలో బాగంగా భూమికి భూమి కేటాయించినా సాగు నీటి సౌకర్యం లేక బీడు భూములుగా ఉన్నాయి.

పోలవరం ప్రాజెక్ట్‌కు సర్వం త్యాగం చేశాం..

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన మా గోడు ప్రభుత్వాలకు పట్టడం లేదు. ఉన్న ఫళంగా ఖాళీ చేసి పునరావాస కాలనీలకు తరలివచ్చి కూలి పనులు చేసుకుని బతకాల్సి వస్తోంది. సరైన వసతులు లేవు, కేంద్ర రాష్ట్ర బృందాలు సైతం సమస్యలు అడిగి వెళ్లడం తప్ప తమకు చేసింది ఏమీ లేదు. అధికారులు మారుతున్నపుడల్లా సమస్యలు తెలుపుతూ ఆర్డీవో, కలెక్టర్లకు వినతులు ఇస్తూ వస్తున్నాం.

జల్లేరు పేరుతో నిండా ముంచారు

పి.నారాయణపురం, పి.అంకంపాలెం పాకలగూడెం గ్రామాల సమీపంలో జల్లేరు ముంపు రిజర్వాయరు ఏర్పాటు నిమిత్తం టీడీపీ ప్రభుత్వ హయాంలో భూసేకరణ చేశారు. ఆయా గ్రామాల వ్యవసాయ భూములకు అప్పట్లో నష్టపరిహారం చెల్లించారు. పొలాల్లో చెట్లకు పరిహారం, ఇళ్లకు నష్టపరిహారం చెల్లించలేదు. పరిహారం చెల్లిస్తే ఈ ప్రాంతం వదిలి వెళ్లిపోదామని ఐదేళ్లుగా గిరిజనులు ఎదురుచూస్తున్నారు.







అప్పుడు ఎర్రిపప్ప ఇప్పుడు నీ...!!

మంత్రి గారి నోటి దురుసు



తణుకు వైసీపీ అభ్యర్థి, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మరోసారి నోరు జారారు. ఇరగవరం మండలంలో ప్రచారానికి వెళుతున్న మంత్రి కారుమూరి గోటేరులో రోడ్డు పక్కన ధాన్యాన్ని సంచులకు ఎత్తుకుంటున్న రైతులను చూసి కారు దిగారు. తలకు పాగా కట్టుకుని రైతుల వద్దకు చేరారు. పంట ఎలా పండింది. ఎలా విక్రయిస్తున్నారు అంటూ రైతులను అడిగారు. ఈ క్రమంలో పక్కన కూర్చున్న రైతు మంత్రికి కాస్తదూరంగా జరిగారు. దాంతో మంత్రి నీ య.. రా.. నేనూ కష్టపడిన వాణ్ణే అంటూ మాట తూలారు. నీ య.. అంటూ సంబోధించడంపై ఇప్పుడంతా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ధాన్యం గింజలు మొక్క మొలుస్తున్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లిన రైతును ఎర్రిపప్పా అని సంబోధించారు. తర్వాత ఎర్రిపప్పా అంటే బుజ్జి కన్నా అంటూ సమర్థించుకున్నారు. ఇప్పుడు నీ య.. అంటే ఏమిటి మంత్రి గారూ అంటూ జనం సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు.

- ఇరగవరం



13న పోలింగ్.. దుకాణాలకు సెలవు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13న అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఆరోజు కార్మికశాఖ ఆంధ్ర ప్రదేశ్ దుకాణముల, సంస్థల చట్టం (1988) ప్రకారం దుకాణాలు, సంస్థలకు సెలవు ప్రకటించాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ పి.శ్రీనివాస్ తెలిపారు. ఏదైనా వ్యాపారం, వాణిజ్యం, పారిశ్రామిక సంస్థ, ఏదైనా ఇతర సంస్థలలో ఉద్యోగం చేస్తున్న ప్రతి వ్యక్తి, శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలో ఓటు వేయడానికి అర్హులైన అందరికీ పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఆదేశించారు. అందరూ దీనిని తప్పనిసరిగా పాటించవలసినదిగా కోరారు. ఏ యజమాని అయినా ఈ నిబంధనను ఉల్లంఘించి వారి వద్ద ఉద్యోగులకు ఓటే వేసే అవకాశం కలిగించకుంటే జరిమానా, శిక్ష తప్పవని ఆయన తెలియజేశారు. ఓటు హక్కు అందరూ వినియోగించుకోవాలన్నారు.

- భీమవరం టౌన్

వాళ్లిద్దరికీ మధ్యంతరంగా..

మంత్రి పదవిపోయింది



కనుమూరి బాపిరాజు



కామినేని శ్రీనివాస్

» అవినీతి ఆరోపణలతో కనుమూరి బాపిరాజు » పొత్తు విఫలమై కామినేని శ్రీనివాస్

» కైకలూరు నియోజకవర్గానికి రెండు పర్యాయాలు మంత్రి పదవులు.. రెండ సార్లూ పదవి కోల్పోయారు

ఎన్నికల్లో ప్రజల తీర్పుతో గెలుపోటములు సాధారణం.. గెలిచిన తర్వాత వచ్చే పదవులు పార్టీ నిర్ణయమే. కైకలూరు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు కేవలం రెండు పర్యాయాలు ఇక్కడి ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు దక్కాయి. అయిదే రెండు మార్లు కూడా ఆ మంత్రులు పదవీకాలం పూర్తి కాకముందే పదవులకు రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కైకలూరు నియోజకవర్గంలో ఒకరు అవినీతి ఆరోపణలు ఎదుర్కొగా మరొకరు పొత్తులు విడిపోవడంతో తమ మంత్రి పదవులను కోల్పోవలసివచ్చింది. కైకలూరు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా రాజకీయ ప్రవేశం చేసిన కనుమూరి బాపిరాజు 1978లో కైకలూరు అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందారు. ఆయన మరో మూడు పర్యాయాలు కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు. 1983లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధికారాన్ని చేజిక్కుంచుకున్న ఇక్కడ కనుమూరి బాపిరాజు కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందారు. 1985, 1989లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ తరఫున కనుమూరి బాపిరాజు గెలుపొందారు. 1989లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీ అధికారం చేజిక్కుచుకుంది. ఆ సమయంలో ముగ్గురు ముఖ్యమంత్రులు రాష్ట్రాన్ని పరిపాలించారు. మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి, నేదురుమల్లి జనార్ధనరెడ్డి ముఖ్యమంత్రులుగా కొనసాగారు. కైకలూరు నుంచి కనుమూరి బాపిరాజుకు మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి పదవి చేపట్టారు. తర్వాత కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రి కావడంతో కనుమూరి ఎక్సైజ్ శాఖ మంత్రిగా పదవి చేపట్టారు. ఆయనపై డిస్టలరీల కుంభకోణం ఆరోపణలతో మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవీకి 1992లో రాజీనామా చేశారు. అనంతరం 1993లో జరిగిన ఉప ఎన్నికల్లో బాపిరాజుకు అసెంబ్లీ టిక్కెట్టు రాకపోవడంతో కైకలూరులో కనుమూరి రాజకీయ జీవితం కనుమరుగైంది.

తర్వాత జరిగిన ఎన్నికల్లో ఒకసారి స్వతంత్ర అభ్యర్థి గెలుపొందగా మిగిలిన పర్యాయాలు గెలిచిన అభ్యర్థులు ప్రతిపక్షానికే పరిమితమయ్యారు. 2014లో తెలుగుదేశం, బీజేపీ పొత్తులో భాగంగా కైకలూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా కామినేని శ్రీనివాస్ గెలుపొందారు. చంద్రబాబు ప్రభుత్వంలో కామినేని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. మూడున్నర సంవత్సరాల కాలం పాటు మంత్రి పదవిలో కొనసాగారు. చంద్రబాబు ఎన్డీఏ కూటమి నుంచి వైదొలగడంతో కామినేని తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

- కైకలూరు

ఓటు వజ్రాయుధం



ఆర్అండ్‌బి కార్యాలయం వద్ద ఓటుపై అవగాహనా ఫ్లెక్సీ

నియోజకవర్గాల్లో వేలాది ఫ్లెక్సీ బోర్డులు

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం.. ఓటు విలువ తెలియజేసేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఓటు వేయడం బాధ్యత అని గుర్తు చేస్తున్నారు. అదే సమయంలో ఎన్నికల్లో అక్రమాలపై ఆరా తీస్తున్నారు. అక్రమాలు గుర్తిస్తే సి విజిల్ యాప్ ద్వారా సమారా ఇవ్వాలని సూచిస్తూ ప్రచార బోర్డులు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా వేలాది ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. రాష్ట్రఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారులు స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వీటిపై 2024 లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ఓటు వేయడం మన హక్కు.. యువత మేల్కొనండి, చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం తప్పనిసరిగా ఓటు వినియోగించుకోవాలని ముద్రించారు.

- ఏలూరు రూరల్



ఎవరూ ఇలా రావద్దు!



సాధారణ ఎన్నికల వేళ తణుకు మండలం, ఇతర ప్రాంతాల ప్రజలకు సైతం పెద్ద కష్టమే వచ్చింది. ఎన్నికల నిబంధనలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు ఆటంకం కలిగిస్తున్నాయి. తణుకు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోనే సబ్ ట్రెజరీ, రిజిస్ట్రేషన్ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మండల వ్యవసాయాధికారి, అగ్నిమాపక శాఖ, మండల పరిషత్ కార్యాలయాలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల స్వీకరణ తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. దీనితో రిటర్నింగ్ కార్యాలయానికి వంద మీటర్ల లోపు ఎవరినీ లోపలికి అనుమతించరాదని ఎన్నికల నిబంధన. దీనితో ప్రధాన రహదారి నుంచి కార్యాలయ ప్రాంగణాల ముఖద్వారం వద్ద బారికేడ్లు, పోలీసు సెక్యూరిటీ ఏర్పాటు చేశారు. ఎవరిని లోపలికి అనుమతించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం వచ్చే వారికి తిప్పలు తప్పడం లేదు. ప్రధానంగా ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చి పెట్టే రిజిస్ట్రార్ కార్యాలయంలో లావాదేవీలకు ఆటంకం కలుగుతోంది. కక్షిదారులు రాక ఆదాయం కూడా పడిపోయింది. తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ కార్యాలయాల్లో వివిధ పనులు నిమిత్తం వచ్చే వారికీ ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాల్సి ఉంది.

- తణుకు

ఆ రోజు.. రావాలి మరి!



సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ ఘట్టం కొనసాగుతోంది. గ్రామాల్లో టీడీపీ, వైసీపీ నాయకులతో పాటు పార్టీ అధినాయకులతో కూడా ప్రచారం చేస్తున్నారు. గ్రామస్థాయి నాయకులు తమకు ఇష్టం ఉన్న పార్టీలో చేరుతున్నారు. ఓటర్లను కలసి తమ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు. ఓటు ఉన్నా గ్రామాంతరం వెళ్లిన వారి ఓట్లు ఎలా అడగాలి. ఏలూరు రూరల్ మండలంలోని కొన్ని ప్రాంతాల్లో బతుకుతెరువు కోసం వలస వెళ్లిన కూలీలపై వైసీపీ, టీడీపీ నాయకులు ఆరా తీస్తున్నారు. ఎంతమంది కూలీలు వలసవెళ్లారు. ఏ ప్రాంతానికి వెళ్లారు. ఎక్కడ ఉన్నారు? ఎప్పుడు వస్తారు? అక్కడ వారికి రోజు ఎంత కూలీ ఇస్తున్నారని తమ అనుచరులతో సమాచారం తెలుసుకుంటున్నారు. హైదరాబాద్, గుంటూరు, రాయచూరు, రాజంపేట, రాజమండ్రి తదితర ప్రాంతాలకు కూలి పనులకు పెద్ద సంఖ్యలో వలస వెళ్లారు. ఉగాదికి వచ్చి మళ్లీ తాము పనులు చేసే ప్రాంతాలకే వెళతారు. ఈ నెలాఖరులో పెండ్లి ముహూర్తాలు 25న కావడంతో కొందరు తమ బంధువుల వివాహాలకు వచ్చి వెళ్లాలని చూస్తున్నారు. అయితే వలసవెళ్ళిన వారితో ఆయా గ్రామాల నాయకులు ఫోన్‌లో మాట్లాడి విషయం తెలుసుకుంటున్నారు. పోలింగ్ రోజుకు రెండు రోజులు ముందు గ్రామానికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కువ మంది వలస వెళ్లినట్లు తెలుస్తోంది.

- ఏలూరు రూరల్

ఐవీఆర్ఎస్.. ప్రచార హోరు..



ప్రస్తుతం ప్రచారంలో టెక్నాలజీదే హవా. ఇప్పుడు అందిరి చేతుల్లోనూ ఫోన్లు ఉంటున్నాయి.ప్రధాన పార్టీలు ఐవీఆర్ఎస్ ద్వారా ప్రచారం చేస్తున్నాయి. పార్టీ ప్రచార పాటలతో హోరెత్తిస్తున్నారు. తమకే ఎందుకు ఓటు వేయాలనే కోణాల్లో వివరిస్తున్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌పై యువత సరదాగా పందాలు కూడా కాస్తున్నారు. రోజుకు ఏ పార్టీ ఫోన్‌లు ఎన్ని వస్తాయో అని లెక్కలేసుకుని పందాలు కాసుకోవడం గమనార్హం. -తాడేపల్లిగూడెం రూరల్

ఎట్టెట్టా..!

పక్క నియోజకవర్గం నుంచి వచ్చి మంత్రులయ్యారు !



ఆచంట నియోజకవర్గం గతంలో ఎస్సీ నియోజకవర్గంగా ఉండేది. తరువాత నియోజకవర్గాల పునర్విభజన సమయంలో ఆచంటను జనరల్‌గా కేటాయించారు. ఆచంట పక్కనే ఉన్న పెనుగొండ నియోజకవర్గం రద్దు కావడంతో అప్పటి వరకు పెనుగొండలో పోటీ చేసిన పితాని సత్యనారాయణ ఆచంట వచ్చి పోటీ చేశారు.పితాని సత్యనారాయణ కాంగ్రెస్, టీడీపీ అభ్యర్థులుగా రెండు సార్లు విజయం సాధించి రెండు సార్లు కూడా మంత్రి పదవులు దక్కించుకున్నారు. అలాగే అత్తిలి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన చెరుకువాడ శ్రీరంగనాథరాజు కూడా మొన్న జరిగిన ఎన్నికల్లో ఆచంట నుంచి పోటీ చేసి ఆయన కూడా మంత్రి పదవి దక్కించుకున్నారు.

సెంటిమెంట్

దొంగరావిపాలెం.. ఈశాన్యం సెంటిమెంట్



ఆచంట నియోజకవర్గంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఆ గ్రామం నుంచే ప్రచారం ప్రారంభిస్తారు. పెనుగొండ మండలం దొంగరావిపాలెం గ్రామం నియోజకవర్గానికి ఈశాన్యంలో ఉండడంతో అభ్యర్థులు సెంటిమెంట్‌గా ఆ.గ్రామం నుంచే ప్రచారం ప్రారంభించడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తున్నది. ప్రస్తుత ప్రధాన పార్టీ అభ్యర్థులు అయిన పితాని సత్యనారాయణ, చెరుకువాడ శ్రీరంగనాథరాజులు ఈ గ్రామం నుంచే తమ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. దీంతో దొంగరావిపాలెంను అభ్యర్థుల ప్రచారానికి సెంటిమెంటు గ్రామంగా పిలుస్తారు.

- ఆచంట

ఇదీ సంగతి !

అభ్యర్థుల పొదుపు మంత్రం



సాధారణంగా ఎన్నికలంటే ఖర్చుతో కూడుకున్న పని. ఒకపక్క ప్రచారం కోసం పార్టీ జెండాలు, టోపీలు మద్దతుదారులకు భోజన సదుపాయం.. ఇలా భారీగా ఖర్చు అయ్యేది. కానీ ప్రస్తుతం ప్రధాన పార్టీ నాయకులు సొమ్ములు ఆచి తూచి ఖర్చు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనే పక్షం రోజుల వరకూ ఎన్నికల హడావుడి కనిపించేది. అనుచరుల కోసం, పార్టీ కార్యకర్తల కోసం పక్షం రోజులు భోజనాలు వండి వడ్డించేవారు. అలాంటిది తాజాగా ఏపార్టీ శిబిరంలోనూ ఈ తరహా భోజనాల హడావుడి కనిపించడం లేదు. అభ్యర్థుల పొదుపు మంత్రానికి ఎన్నికల సంఘం జమా ఖర్చులు కూడా ఓ కారణంగా కనిపిస్తోంది.

- తాడేపల్లిగూడెం రూరల్

గోదావరి తీరాన పచ్చని పొలాలు మధ్య కాలుష్యానికి దూరంగా ఉన్నదే ఆచంట నియోజకవర్గం. చుట్టూ ఎటు చూసినా పచ్చని పంట పొలాలే. వశిష్ట గోదావరి తీరాన పచ్చటి పొలాలు..గలగలపారే గోదావరి సోయగాలు..లంక గ్రామాలతో పూర్తి గ్రామీణ నేపథ్యం కలిగిన నియోజకవర్గం ఆచంట. పట్టణాలకు దూరంగా చిన్న చిన్న గ్రామాలుగా నాలుగు మండలాలతో కలిసి ఉంటుంది. అటు ఆధ్యాత్మికంగా , ఇటు వాణిజ్యపరంగా, క్రీడా పరంగా ఒక్కో మండలం ఒక్కో ప్రత్యేకత కలిగి ఉంది. నియోజకవర్గంలో మొత్తం లక్షా 78 వేల 667 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 88 వేల 319 మంది , మహిళలు 90 వేల 348 మంది ఉన్నారు.

- ఆచంట



ఆచంట సెంటర్

ఫ్లాష్ బ్యాక్

ఆచంట.. అందరిదీ !

1962లో నియోజకవర్గం ఏర్పాటు
రాజకీయంగా చైతన్యం
ప్రసిద్ధ ఆలయాలకు నిలయం
బాస్కెట్ బాల్ కేరాఫ్ మార్టేరు



ఆరంభం నుంచి రాజకీయంగా చైతన్యం కలిగిన నియోజకవర్గం ఆచంట. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు కాంగ్రెస్ కంచుకోటగా ఉంటే ఒక్క ఆచంట మాత్రం భిన్నంగా ఉండేది. ఒక్కొక్క సారి ఒక్కొక్క పార్టీకి విజయం ఇచ్చేది. గతంలో కమ్యూనిస్టులకు కంచుకోటగా ప్రజా ఉద్యమాలకు పురిటిగడ్డగా రాజకీయ చైతన్యం కలిగిన నియోజకవర్గంగా ఆచంటకు రాష్ట్రంలో ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. ఇప్పటి వరకు 13 సార్లు ఎన్నికలు జరగ్గా మూడు పార్టీలకు సమాన విజయాలను అందించే ఇక్కడి ఓటర్లు తమ విలక్షతను చాటుకున్నారు. 47 సంవత్సరాలు పాటు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా కొనసాగి 2009 నుంచి జనరల్‌గా మారింది. ఆచంట నియోజకవర్గంలో 1962 నుంచి 13 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇపుడు 14వ సారి ఎన్నికలు జరుగుతున్నాయి.

అటూ..ఇటూ ఆధ్యాత్మిక క్షేత్రాలు



ఆచంటేశ్వర స్వామి

గోదావరికి అటు తూర్పుగోదావరి, ఇటు పశ్చిమ గోదావరి నాలుగు మండలాలతో ఆధ్యాత్మిక కేంద్రంగా అలరారుతోంది. పెనుగొండలో ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీమాత ఆలయం, 90 అడుగుల వాసవీమాత పంచలోహ విగ్రహంతో ఈ ప్రాంతం క్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది. ఆచంలో జైనుల ఇష్ట దైవం అయిన శ్వేతాంబర్ జైన్ దేవాలయం, ఆచంటలోని రామేశ్వరస్వామి, గోదావరి సమీపంలో పెదమల్లంలో మాచేనమ్మ ఆలయం పెనుమంట్ర మండలం నత్తా రామేశ్వరం, జుత్తిగ ఉమా వాసుకి రవి సోమేశ్వరస్వామి ఆలయాలు క్షేత్రాలుగా విలసిల్లు తున్నాయి. ఇక మార్టేరు క్రీడాకారులకు పెట్టింది పేరు. నేటికి జాతీయస్థాయి ఎంతో మంది క్రీడాకారులు తమ ప్రతిభ చాటుకున్నారు. 1926లో జిల్లా గెజిట్ ప్రకారం ఏలూరు తరువాత రెండో వాణిజ్య కేంద్రంగా పెనుగొండ ప్రాధాన్యం సంతరించుకుంది. నెగ్గిపూడిలో వరి పరిశోధనా కేంద్రం అంతర్జాతీయ కేంద్రంగా పేరు గడించింది.

కీలకమైన నియోజకవర్గం

జిల్లాలో ఆచంట నియోజకవర్గం ఎంతో కీలకమైనది. టీడీపీ ఆవిర్భావం నుంచి ప్రజలు ఆదరిస్తూనే ఉన్నారు. 1985లో జరిగిన ఎన్నికల పొత్తులో భాగంగా ఆచంటను సీపీఎంకు కేటాయించగా విజయం సాధించింది. 1989, 1994లో కూడా వామ పక్షాలకు సీటును కేటాయించగా కాంగ్రెస్‌పై విజయం సాధించారు. తరువాత వామ పక్షాలతో పొత్తు లేకపోవడంతో టీడీపీ సొంతంగా అభ్యర్థిని రంగంలోకి దింపింది. ఆచంట ఎస్సీ రిజర్వుడు కావడంతో అప్పట్లో మోచర్ల జోహర్‌వతిని టీడీపీ తరుపున రంగంలోకి దింపగా మెజారిటీతో విజయం సాధించారు.

అప్పటి నుంచి 2009లో జరిగిన ఎన్నికల్లో మినహా టీడీపీ తన పొత్తును నిలుపుకుంది.

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు	ప్రత్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
1962	పి.శ్యామ్ సుందరరావు	సీపీఐ	25,306	డి.పెరుమాళ్లు	కాంగ్రెస్	22,781
1967	దాసరి పెరుమాళ్ళు	కాంగ్రెస్	31,630	దిగుపాటి సుందరరాజు	సీపీఎం	23,925
1972	జి.వెంకన్న	కాంగ్రెస్	30,783	జి.సుందరరాజు	సీపీఎం	25,853
1978	కోట ధనరాజు	కాంగ్రెస్(ఐ)	39,504	జి.సుందరరాజు	సీపీఎం	21,622
1983	కె. భాస్కరరావు	టీడీపీ	45,631	కె.ధనరాజు	కాంగ్రెస్	17,264
1985	ఎ.చిత్తరంజన్	సీపీఎం	51,016	కామిడి అంభుజి	కాంగ్రెస్	19,294
1989	డి.రాజ్‌గోపాల్	సీపీఎం	46,641	కె.భాస్కరరావు	కాంగ్రెస్	38,242
1994	డి.రాజ్‌గోపాల్	సీపీఎం	53,510	బుంగా సారథి	కాంగ్రెస్	30,872
1999	మోచర్ల జోహర్‌వతి	టీడీపీ	52,954	బుంగా సారథి	కాంగ్రెస్	30,227
2004	పీతల సుజాత	టీడీపీ	46,670	చెల్లం ఆనంద ప్రకాష్	కాంగ్రెస్	41,029
2009	పితాని సత్యనారాయణ	కాంగ్రెస్	54,903	కె.రాధాకృష్ణారెడ్డి	టీడీపీ	39,148
2014	పితాని సత్యనారాయణ	టీడీపీ	63,549	ఎం.ప్రసాదరాజు	వైసీపీ	59,629
2019	చెరుకువాడ శ్రీరంగనాథరాజు	వైసీపీ	66,494	పితాని సత్యనారాయణ	టీడీపీ	53,608

నియోజకవర్గంలో ఓటర్లు

మొత్తం ఓటర్లు : 1,78,667
పురుషులు : 88,319
మహిళలు : 90,348
పోలింగ్ కేంద్రాలు : 187
పెనుమంట్ర 53, పెనుగొండ 57, ఆచంట 50, పోడూరు 27

టీడీపీ-సీపీఎం పొత్తులో ఏడు సార్లు విజయం

1983 టీడీపీ ఆవిర్భావం నుంచి ఆచంట నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 4 సార్లు టీడీపీ, టీడీపీ పొత్తుతో 3 సార్లు సీపీఎం అభ్యర్థులు విజయం సాధించడంతో ఒక సారి కాంగ్రెస్ , ఇంకొక సారి వైసీపీ అభ్యర్థి విజయం సాధించారు. 1983లో టీడీపీ ఆవిర్భావం జరిగిన ఎన్నికల్లో కోట బాస్కరరావు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తమ సమీప కాంగ్రెస్ అభ్యర్థి ధనరాజుపై ఏకంగా 32,467 ఓట్లతో విజయం సాధించారు. 1985లో సీపీఎం అభ్యర్థిగా అలుగు చిత్తరంజన్, 1989లో సీపీఎం అభ్యర్థిగా దిగుపాటి రాజగోపాల్ విజయం సాధించగా 1989లో మోచర్ల జవహర్‌వతి టీడీపీ అభ్యర్థిగా , 2004లో పీతల సుజాత విజయం సాధించారు. 2009లో పితాని సత్యనారాయణ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. తరువాత పితాని సత్యనారాయణ కాంగ్రెస్ నుంచి టీడీపీలో చేరి 2014లో టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించారు. తరువాత 2019లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన చెరుకువాడ శ్రీరంగనాథరాజు టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణపై 12,886 ఓట్లతో విజయం సాధించారు. టీడీపీ ఆవిర్భావం తరువాత 9 సార్లు ఎన్నికలు జరగ్గా టీడీపీ, సీపీఎం పొత్తుతో ఏడు సార్లు విజయం సాధించగా ఒక సారి కాంగ్రెస్, ఇంకొసారి వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు.

ఆరంభంలో ఎస్సీ నియోజకవర్గం

పూర్వం ఎస్సీ నియోజకవర్గం కావడంతో అప్పట్లో ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాలతో కలిసి నియోజకవర్గంగా ఉండేది. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనతో ఆచంట మండలంతో పాటు పెనుగొండ , పెనుమంట్ర, మండలాలు వచ్చి చేరాయి. దీంతో ఆచంట నియోజకవర్గం ఆచంట మండలంతో పాటు పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాల నాలుగు మండలాలతో ఉంది. ప్రస్తుతం జనరల్ స్థానంగా కొనసాగుతుంది.



మార్టేరు వరి పరిశోధన కేంద్రం

ఎన్నికల తనిఖీలు..రూ.3.36 లక్షలు స్వాధీనం



కొత్తూరు చెక్‌పోస్టు వద్ద నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కామవరపుకోట, /ఉంగుటూరు, ఏప్రిల్ 20 :సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్తూరు ఎన్నికల చెక్‌పోస్టు వద్ద రాకపోకలు సాగించే వాహనాలను శనివారం తనిఖీలు చేయగా ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకు వెళుతున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రెండు లక్షల 53 వేల రూపాయలు స్వాధీనం చేసు కున్నట్లు చెక్‌పోస్టు అధికారి ఎండీ మొహిద్దీన్ తెలిపారు. తాడిచెర్ల గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి లక్షా 13 వేలు, జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్ల గూడేనికి చెందిన వ్యక్తి నుంచి లక్షా 40 వేలు స్వాధీనం చేసుకుని ఎన్నికల ట్రెజరీకు జమ చేశామన్నారు. తనిఖీలలో హెచ్‌సీ కె.రమేష్, కె.రామకృష్ణ, జి.సూర్యా రావు, షేక్ నాగూర్, ఎం.నాగార్జున, సుధీర్ తదితరులు ఉన్నారు. ఉంగుటూరు టోల్ ప్లాజా వద్ద శుక్రవారం రాత్రి ఫ్లైయింగ్ స్క్వాడ్ తని ఖీలలో అనమతి లేని రూ.88 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

20-04-2024
పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	266	226	238.16
జంగారెడ్డిగూడెం-1	266	235	249.64
జంగారెడ్డిగూడెం-2	266	235	250.90
కొయ్యలగూడెం	263	235	249.22
గోపాలపురం	266	235	248.41



ఇంటి నుంచే ఓటేయండి

హోమ్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : జేసీ లావణ్య

పెదవేగి, ఏప్రిల్ 20 : పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేనివారు హోమ్ ఓటింగ్ అవకాశాన్ని వినియోగించుకోవాలని దెందులూరు ఎన్నికల అధికారిణి, జిల్లా సంయుక్త కలెక్టర్ బి.లావణ్యవేణి సూచించారు. హోమ్ ఓటింగ్ విధానంపై ఆమె పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయలేని 85 ఏళ్లు దాటిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, నడవలేని పరిస్థితిలో ఉన్న వారికోసం ఎన్నికల కమిషన్ హోమ్ ఓటింగ్ విధానాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. ఈ విధానంలో ఇంటివద్ద నుంచే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం ఉందని, దీనికోసం అర్హులైన ఓటర్లు ఫారం - 12(డి) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఫారం- 12(డి)ను సంబంధిత పోలింగ్ బూత్‌స్థాయి అధికారి/తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ నుంచి పొందవచ్చన్నారు. పూర్తిచేసిన దరఖాస్తును ఈనెల 23వ తేదీలోగా తిరిగి అక్కడే అందించాలని ఆమె సూచించారు. ఆ దరఖాస్తును సహాయ ఎన్నికల అధికారులు పరిశీలించి, అర్హత ఆధారంగా వచ్చేనెల రెండో తేదీ నుంచి ఐదో తేదీ మధ్య ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు ఇంటివద్ద ఓటుహక్కు వినియోగించుకునే వెసులు బాటును కల్పిస్తారన్నారు. ఈ హోమ్ ఓటింగ్ ప్రక్రియ ఎన్నికల ప్రిసైడింగ్, ఇతర ఎన్నికల అధికారులు, మైక్రో అబ్జర్వర్, బీఎల్వోలు, సెక్టార్ అధికారులు, పార్టీల ఏజెంట్ల సమక్షంలో వీడియోగ్రఫీ ద్వారా జరుగుతుందని వివరించారు.



• సైకిలెక్కిన ఆరిమిల్లి దంపతులు

అభ్యర్థులు వినూత్న రీతుల్లో ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. తణుకులో ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసీ పసుపు సైకిల్ ఎక్కి ప్రచారం నిర్వహించారు. ఆరిమిల్లి సైకిల్ తొక్కుతుండగా వెనుక ఆయన సతీమణి కూర్చుని సైకిల్ గుర్తు చూపిస్తూ కార్యకర్తలను ఉత్సాహపరిచారు.

• తండ్రికి మద్దతుగా కూతురు

దెందులూరు కూటమి అభ్యర్థి చింతమనేనికి మద్దతుగా ఆమె కుమార్తె నవ్య ప్రచారం రంగంలోకి దిగింది. అవినీతికి అడ్డాగా మారిన వైసీపీని చిత్తుగా ఓడించి అభివృద్ధికి చిరునామా అయిన కూటమిని గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు. శనివారం చల్ల చింతలపూడిలో టీడీపీ నాయకుడు కమ్మ శివ రామకృష్ణతో కలిసి సూపర్ సిక్స్ పథకాలపై కర పత్రాలను పంచారు.

- తణుకు , దెందులూరు

ఎన్నికల సిత్రాలు




పదే పదే అవే హామీలు

50 ఏళ్లుగా ఇదే తంతు !



నరసాపురం, ఏప్రిల్ 20: నరసాపురం నియోజకవర్గ ఓటర్లు 50 ఏళ్లుగా ప్రధాన పార్టీలు ఇస్తున్న హామీలను నమ్మి నమ్మి విస్తుపోయారు. ఇక్కడ ప్రధాన సమస్యలు రెండే రెండు..ఒకటి వశిష్ట వారధి, మరొకటి బియ్యపుతిప్ప హార్బర్. ప్రతి ఎన్నికల్లోనూ అన్ని పార్టీలు ఈ రెండు సమస్యలపైనే హామీలు గుప్పిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో వీటిని నిర్మిస్తామని శపథం చేస్తుంటాయి. కానీ ఐదేళ్లు పూర్తయినా.. ఇవి మాత్రం నేరవేరడం లేదు. వారధి నిర్మాణానికి గడిచిన 40 ఏళ్ళల్లో ముగ్గురు సీఎంలు శంకుస్థాపన చేశారు. ఇటు హార్బర్ పనులకు ఒక ముఖ్యమంత్రి, మరో కేంద్ర మంత్రి, రాష్ట్రమంత్రులు శంకుస్థాపనలు చేశారు. అయినా ఈ రెండు పనులు పూర్తికాలేదు.వాటి శిలాఫలకాలు నేటికి వెక్కిరిస్తున్నాయి. సాధారణ ఎన్నికలతో పాటు ఉప ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీలు వీటిపైనే గురి పెట్టి ఓట్లు దండుకున్నాయే తప్ప పనులు మాత్రం చేపట్టడం లేదు. ఈసారి ఎన్నికల్లోనూ ప్రధాన పార్టీలు మరోసారి ప్రజల్ని నమ్మించే ప్రయత్నం మొదలు పెట్టాయి. మమ్మల్ని గెలిపించండి.. కచ్చితంగా ఈ రెండు పనులు పూర్తి చేస్తామంటూ ప్రజల్ని అభ్యర్థిస్తున్నారు.

గోడ దూకేద్దామా ?



పాలకొల్లు, ఏప్రిల్ 20 : ఎన్నికల వేళ పార్టీలు ఫిరాయించడం, రాత్రికి రాత్రే కండువాలు మార్చివేయడం సహజమే. అయితే ఇప్పుడు నామినేషన్ల ప్రక్రియ మొదలైన తర్వాత పాలకొల్లు నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన పలువురు గోడ దూకేయడానికి సిద్ధంగా ఉన్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆది నుంచి పాలకొల్లు అధికార వైసీపీలో నాలుగు స్తంభాల ఆట జరుగుతూనే ఉంది. నాలుగేళ్ళుగా స్థానిక, స్థానికేతరులుగా నాయకులు విడిపోతుంటే, ఆయా నాయకులను అభిమానించే ద్వితీయస్థాయి నాయకులు, కార్యకర్తలు ధర్మ సంకటంలో పడుతూనే ఉన్నారు. ఇప్పుడు తాజాగా పలువురు టీడీపీలోకి వచ్చే అవకాశాలపై ప్రచారం జరుగుతోంది. గతంలో అధికార పార్టీ అభిమానులుగా చలామణి అవుతూ వివిధ కాంట్రాక్ట్ పనులు చేసి చేతులు కాల్చుకున్న వారు కొందరు, తాము అభిమానించే వారు కాకుండా టికెట్ మరొకరికి ఇచ్చారని మరి కొందరూ, సామాజికవర్గ పరంగా మరికొందరూ గోడ దూకుళ్ళకు సిద్ధమవుతున్నట్లుగా ఆ పార్టీ శ్రేణుల్లోనే వినిపిస్తోంది. రెండు దఫాలు మినహా పాలకొల్లు నియోజకవర్గం కాపు సామాజిక వర్గానికి చెందిన వారికే ఎమ్మెల్యే పదవి దక్కింది. ఇప్పుడు వైసీపీ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని బరిలోకి దింపారు. బీసీ వర్గాలు ఎప్పుడు టీడీపీనే వెన్నంటి ఉంటాయని టీడీపీ వర్గాలు ఆశిస్తుండగా ఈదఫా తమ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు అత్యధిక శాతం తమ అభ్యర్థికే పడతాయని వైసీపీ శ్రేణులు ఆశిస్తున్నాయి. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని ముందుగానే దుకాణం సర్దివేస్తే మెరుగ్గా ఉంటుందని పలువురు వ్యాఖ్యానించుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది.



ప్రజాసంకల్ప యాత్రలో పాల్గొన్న బడేటి చంటి

జగన్ చేతకాని పాలనతో అన్నీ ఇబ్బందులే

» ఏలూరు టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థి బడేటి చంటి

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 20 : చేతకాని పాలనతో జగన్ ప్రజల జీవితాలను తలకిందులు చేశారని, అన్నీ ఇబ్బందులేనని ఏలూరు టీడీపీ కూటమి అసెంబ్లీ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. శనివారం ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా 47వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు కూటమికి ప్రజాదరణ పెరుగుతోందన్నారు. కూటమికి పెరుగుతున్న ప్రజాదరణను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. ఎండ సమయంలో కూడా ప్రజలు తనపై చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. మన ప్రభుత్వం రాగానే మీ సమస్యలన్నీ పరిష్కరించి రుణం తీర్చుకుంటానన్నారు. వైసీపీ పతనానికి నాంది పడిందని ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు డిపాజిట్‌లు రావన్నారు. ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు నిర్ణయించుకున్నారన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్, కాశీ నరేష్, దుర్గాభవాని, శ్రీనివాస్, మోజేష్, బాబ్జి, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపీట

» చింతలపూడి టీడీపీ కూటమి అభ్యరి సొంగా రోషన్‌కుమార్



సీతానగరంలో మాట్లాడుతున్న రోషన్‌కుమార్

చింతలపూడి, ఏప్రిల్ 20: కూటమి మేనిఫెస్టోలో మహిళలకు, బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందని చింతలపూడి టీడీపీ కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శనివారం సీతానగరం గ్రామంలో ఇంటింటా ప్రచార కార్యక్రమం గ్రామంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. భారీగా అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు తరలి వచ్చారు. బాబు ష్యూరిటీ పథకం, సూపర్‌సిక్స్ పథకాలను మహిళలకు వివరించారు. రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఎక్కడకు ప్రయాణించినా ఉచిత ప్రయాణమని, విద్యార్థులు ఎందరు ఉన్న కుటుంబంలో చదువుకోవడానికి నిధులు, నిరుద్యోగ భృతి, రైతులకు ఏడాదికి రూ.20వేలు ఆర్థికసాయం వంటి ఎన్నో పథకాలు రానున్నాయని, పింఛన్ రూ.4వేలు చేస్తామని, పెన్షన్లు యథావిధిగా కొనసాగుతాయని భరోసా ఇచ్చారు. అసెంబ్లీకి తనను, పార్లమెంట్ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌కు రెండు ఓట్లు సైకిల్ గుర్తుకు వేసి విజయం పొందేవిధంగా అందరూ సహకరించాలని కోరారు. అధికారంలోకి రాగానే రోడ్లు, సీతానగరం ప్రాంతంలోని సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. గోదావరి నుంచి ఎత్తిపోతల పథకం రెండేళ్లలో పూర్తయ్యేలా కృషిచేస్తానన్నారు. టీడీపీ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి, సూరానేని గోపి, కక్కిరాల నాగేశ్వరరావు, మాటూరి వెంకటరామయ్య ముత్తా శేఖర్, కొమ్మరాజు సత్యనారాయణ, నాంచారయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గన్ని, జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, శరణాల మాలతీరాణి, వట్టి పవన్ కుమార్ తదితరులు

రేపు పవన్ కల్యాణ్ పర్యటన జయప్రదం చేయాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

ఉంగుటూరు, ఏప్రిల్ 20 : గణపవరంలో ఈనెల 22న జరిగే జనసేనాని కొణిదెల పవన్ కల్యాణ్ పర్యటన విజయవంతం చేయాలని జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక జనసేన కార్యాలయంలో శనివారం జరిగిన కూటమి కార్యకర్తల సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శరణాల మాలతీరాణి, నియోజకవర్గ జనసేన పరిశీలకుడు వట్టి పవన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆయా మండలాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. 22న ఏలూరులో జరిగే ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్ నామినేషన్ కార్యక్రమానికి, 23న జరిగే పత్సమట్ల ధర్మరాజు నామినేషన్ కార్యక్రమానికి మూడు పార్టీల కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

శ్రీవారి సేవలో డీఆర్‌డీఏ కమిషనర్



డీఆర్‌డీఏ కమిషనర్ దంపతుల పూజలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 20: చినవెంకన్న ఆలయాన్ని డీఆర్‌డీఏ అడిషినల్ కమిషనర్ కట్టా సింహాచలం శనివారం ఉదయం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన అయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

వెంకన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల క్షేత్రం శనివారం భక్తజనులతో కళకళలాడింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉదయం నుంచే ఆల యానికి భక్తుల రాక ప్రారంభమైంది. దాదాపు 15 వేల మంది వరకూ భక్తులు ఆలయానికి వచ్చినట్లు అధికారుల అంచనా వేశారు.

మాగంటి బాబును కలిసిన కూటమి అభ్యర్థులు

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 20 : టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు)ను ఏలూరు పార్లమెంట్, అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు పుట్టా మహేష్‌యాదవ్, చింతమనేని ప్రభాకర్ కలసి బాబు నివాసంలో మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ సీనియర్ నాయకుడిగా మాగంటి బాబు టీడీపీకి ఎన్నో సేవలు చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో తమకు సహకరించాలని కోరామని తెలిపారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

ఏలూరు రూరల్/ఉంగుటూరు, ఏప్రిల్ 20: స్థానిక ఏడో డివిజన్ మూడో సచివాలయంలో పనిచేస్తున్న 11మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వారంతా ఎమ్మెల్యే ఆళ్ల నాని క్యాంప్ కార్యాలయంలో నానిని కలిసి రాజీనామా విషయాన్ని తెలిపారు. ఇటీవల ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామానికి చెందిన పదకొండు మంది వలంటీర్లు రాజీనామా చేసి ఎమ్మెల్యే కొట్టారు అబ్బయ్యచౌదరిని కలిశారు. ఉంగుటూరు మండలంలో శనివారం పదకొండు మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఉప్పాకపాడులో పది మంది, బాదంపూడిలో ఒకరు రాజీనామా చేశారని ఎంపీడీవో శర్మ తెలిపారు.

ఆయుర్వేద ఆసుపత్రులను వినియోగించుకోవాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 20 : ఉంగుటూరులోని ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో కొత్త ఉంగుటూరు అంగన్వాడీ కేంద్రంలో వైద్య సేవలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి వైద్యురాలు కస్తూరి శిరీష కోరారు. శనివారం అయుర్వేద ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరాన్ని దెందులూరు ఆయుర్వేద వైద్యాధికారి నగేష్‌తో కలిసి నిర్వహించారు. శిబిరంలో సుమారు నూటయాభై మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. వైద్యశిబిరంలో సిబ్బంది కృష్ణకుమారి, అంజాద్ బేగ్ సేవలందించారు.







ఉంగుటూరులో కేక్ కట్ చేస్తున్న గన్ని,ధర్మరాజు, జంగారెడ్డిగూడెం.. తిమ్మాపురంలో కేక్ కట్ చేసిన పార్టీ నాయకులు

విజనరీ బాబును సీఎం చేద్దాం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని

» ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ఉంగుటూరు/భీమడోలు, ఏప్రిల్ 20 :భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విజనరీ సృష్టికర్త చంద్రబాబును రాష్ట్ర ముఖ్యమంత్రిని చేయాలని టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం ఉంగుటూరు జనసేన కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జనసేన ఉంగుటూరు నియోజకవర్గ అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు మాట్లాడారు. అనంతరం బీజేపీ అ సెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, గన్ని కూటమి కార్యకర్త లతో కలిసి భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలు అభిమానులకు అందించారు. ఉంగుటూరులోని అనురాధ అనాధ ఆశ్రమం పిల్లలకు తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రెడ్డి సూర్యచంద్రరావు ఆర్థిక సహకారంతో ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పిల్లలకు బట్టలు, నిత్యావసరాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. భీమడోలు మండలం భీమడోలులోని మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు క్యాంపు కార్యాలయంలో ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్‌తో కలిసి గన్ని వీరాంజనేయులు కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచారు.

● ఏలూరు టూటౌన్ : ఏలూరు-హిజ్రాయిల్ పేటలో ఏలూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. దుర్గాభవాని, శ్రీనివాస్, మోజేస్, యోహాన్, గంగరాజు, పండు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు క్యాంపు కార్యాలయంలో మాజీ చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఐసీఎం ఫాస్టర్ యోపు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం శాస్త్రి కాలనీలో కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. రాంబాబు, విఠల్, గంగాధరరావు, ప్రసాద్, వెంకటలక్ష్మి, విప్రసాద్ పాల్గొన్నారు.

● చింతలపూడి/లింగపాలెం/బుట్టాయగూడెం, ఏప్రిల్ 20: చింతలపూడి పార్టీ కార్యాలయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ చిట్లూరి ధర్మరాజు, బోడా నాగభూషణం, కొత్తపూడి శేషగిరిరావు, తాటి అప్పారావు, కె.రాజారెడ్డి, టి.రామారావు, రాజారత్నం, అట్లూరి శ్రీనివాసరావు, సుభానీ, డి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. లింగపాలెం మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు, గుత్తా సత్యసాయివరప్రసాద్, మునునూరి రాము, మోరంపూడి మల్లికార్జునరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో చింతలపూడి కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కేక్‌ను కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. మండవ లక్ష్మణరావు, దాసరి శ్యామ్‌చంద్రశేష, పెనుమర్తి రామ్‌కుమార్, రాజాన సత్యనారాయణ, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, నంబూరి రామచంద్రరాజు, షేక్ యాకూబ్, కొప్పాక శ్రీనివాసరావు, పరిమి సత్తిపండు, బొబ్బర రాజ్‌పాల్, గుళ్లపూడి శ్రీదేవి, పగడం సౌభాగ్యవతి, తూటికుంట రాము తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం/జీలుగుమిల్లి/టి.నరసాపురం:బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయంలో ఎన్డీఏ కూటమి నేతలు ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలవరం నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేట్ కట్ చేశారు. ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు, శీలం వెంకటేశ్వరావు, పారేపల్లి రామారావు, శ్రీనివాస్ గౌడ్, మొగపర్తి సోంబాబు, కరాటం వెంకటరెడ్డినాయుడు, కరాటం సాయి తదితరులు పాల్గొన్నారు. జీలుగుమిల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయి ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి అందజేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు, గొట్టాల సత్యనారాయణ, యాండ్ర శేఖర్ తదితరులు ఉన్నారు. టి.నరసాపురం మండలం తిరుమలదేవిపేటలో రాష్ట్ర తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. వడ్డే శ్రీను, తోట వీరాస్వామినాయుడు, కాసగాని వీరాజు, మన్యం దుర్గారావు, అబ్బదాసరి పండు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మధ్యాహ్నపు సురేష్ పాల్గొన్నారు.

● కుక్కునూరు : కుక్కునూరు మండలంలో పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు గృహంలో చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరావు, కోటగిరి సత్యనారాయణ, భాస్కరరావు, పిచుక రాజు, రమణరాజు, రాంబాబు, అంగిరేకుల బాలాజీ, జనసేన మండల అధ్యక్షుడు ములిశెట్టి యుగంధర్, వెంకన్నబాబు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

● పెదవేగి/పెదపాడు : పెదవేగి మండలం దుగ్గిరాలలో చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో చంద్రబాబునాయుడు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెనుబోయిన మహేష్‌యాదవ్, టీడీపీ నాయకులు మంచినేని శ్రీనివాసరావు, కొనకళ్ళ శివమణి తదితరులు పాల్గొన్నారు. పెదపాడు మండలం అప్పనవీడులో టీడీపీ నాయకుడు వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమారుడు ప్రేమ్‌బాబు పుట్టినరోజులను పురస్కరించుకుని పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. వడ్డి వాసవి, బెక్కం లక్ష్మీనారాయణ, గూటాల సంజీవరావు, బోయపాటి దీపు, కోటప్రోలు సురేష్, బార్గవ్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల : మాజీ సీఎం చంద్రబాబునాయుడు నిండు నూరేళ్ల జీవించాలని, రాష్ట్రాభివృద్ధి కోసం మళ్లీ సీఎం కావాలని కోరుకుంటూ తిమ్మాపురంలో పార్టీ మండల నాయకులు శనివారం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు, బాణసంచా కాల్చారు. కేక్ కట్ చేసి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. పోలిన శ్రీనివాసరావు, మంటా శ్రీనివాసరావు, కొయ్యలమూడి చంటియ్యఆచంట సత్యనారాయణ, పోలిన బాలరాజు, కె.విష్ణు, మల్లాది రాంబాబు, కూచింపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.







కుక్కునూరులో చంద్రబాబు జన్మదిన వేడుకలు.. జీలుగుమిల్లిలో టీడీపీ నాయకులు.. దుగ్గిరాలలో కేక్ కట్ చేస్తున్న చింతమనేని ప్రభాకర్


అందరిని కలుపుకుని వెళతా : చిర్రి బాలరాజు



గవరవరంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు

కొయ్యలగూడెం/బుట్టాయగూడెం, ఏప్రిల్ 20 : అందరిని కలుపుకుని వెళతానని పోలవరం నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి చిర్రి బాలరాజు అన్నారు. శనివారం కొయ్యలగూడెం మండలంలో గవరవరం, చొప్పరామన్నగూడెం, దిప్పకాయలపాడు, కన్నాపురం గ్రామాల్లో ఆయన టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. టీడీపీ బీజేపీ నాయకులంతా తన గెలుపు కోసం సహకరించాలని కోరారు. బుట్టాయగూడెం మండలం బుట్టాయగూడెం బొరగం శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో బొరగం శ్రీనివాస్, చిర్రి బాలరాజు, శీలం వెంకటేశ్వరావు, శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. అందరూ కలిసికట్టుగా జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజును గెలిపించు కోవాలని పిలుపునిచ్చారు. నాయకులు పారేపల్లి రామారావు, మొగపర్తి సోంబాబు, కరాటం వెంకటరెడ్డినాయుడు, కరాటం సాయి, గెడ్డమణుగు రవికుమార్, కొండేపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూటమికి మద్దతివ్వాలి..



ముండూరులో రాధారాణి ప్రచారం

దెందులూరు/పెదవేగి, ఏప్రిల్ 20 : అవినీతికి అడ్డాగా మారిన వైసీపీని చిత్తుగా ఓడించి.. అభివృద్ధికి చిరునామా కూటమికి అందరూ మద్దతు పలకాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్య అన్నారు. శనివారం చల్చింలతపూడి గ్రామంలోని పాతకమ్మవారి గూడెంలో టీడీపీ నేత కమ్మ శిరామకృష్ణతో కలిసి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. దెందులూరు మండలం గాలాయగూడెం, పెదవేగి మండలం ముండూరులో చింతమనేని ప్రభాకర్ సతీమణి రాధారాణి ప్రచారం నిర్వహించారు.

రేపు, ఎల్లుండి కూటమి అభ్యర్థుల నామినేషన్

పెదవేగి/ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 20 : దెందులూరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఈనెల 22న నామినేషన్ వేయనున్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని స్వగృహంనుంచి బయలుదేరి ఏలూరు ఫైర్‌స్టేషన్, పాతబస్టాండ్, ఆశ్రం ఆస్పత్రి మీదుగా దెందులూరు చేరుకుని నామినేషన్ వేస్తారని టీడీపీ నాయకుడు బొప్పన సుధాకర్ తెలిపారు. అదేరోజున ఏలూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్, ఈనెల 23న ఏలూరు అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి నామినేషన్‌లు దాఖలు చేయనున్నారు. జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. సమావేశంలో టీడీపీ జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 20:జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఏకాదశ వార్షికోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శనివారం అర్చకులు ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, గోపూజ, అఖండ దీపారాధన, నవగ్రహ హోమాలను వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ శాశ్వత చైర్మన్ కీసరి రామిరెడ్డి దంపతులు, ప్రెసిడెంట్ తమ్మన వెంకటేశ్వరరావు దంపతులు, సెక్రెటరీ నెక్కలపూడి సూర్యచంద్రరావు దంపతులు, కోశాధికారి గుంట్ల వెంకటేశ్వరరావు దంపతులు, తదితరులు భక్తులు పాల్గొన్నారు.

22నుంచి విద్యుత్ సరఫరా నిలుపుదల

పెదపాడు, ఏప్రిల్ 20 : పెదపాడు సెక్షన్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో వున్న 11 కేవీ రాళ్లపల్లివారిపాలెం న్యూలైన్ల నిర్మాణం, లైన్ల మరమ్మతుల నిమిత్తం ఈనెల 22, 23, 24వ తేదీల్లో ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని పెదపాడు ఎలక్ట్రికల్ ఏఈ వై.రాంబాబు ప్రకటనలో తెలిపారు. ఖాజీగూడెం, గుడిపాడు, సత్యవోలు, రాళ్లపల్లివారిపాలెం పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సహకరించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థులకు పీవో అభినందన

బుట్టాయగూడెం, ఏప్రిల్ 20 : కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని గురుకుల కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 800పైగా మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులను, మొదటి సంవత్సరంలో 400 మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులను శనివారం ఐటీడీఏలో పీవో ఎం.సూర్యతేజ అభినందించారు. విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడి భవిష్యత్ కార్యచరణ ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. మంచి కాలేజిలను ఎంచుకుని విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.

37,067 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

» జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

ఏలూరుసిటీ, ఏప్రిల్ 20: ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు 3,117 మంది రైతుల నుంచి రూ. 80.76 కోట్ల విలువైన 37,067 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని జిల్లా జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. శనివారం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ ప్రారంభించబడి ఇప్పటివరకు 7,517 మంది రైతులకు చెందిన 67,723 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నమోదు చేసుకోగా గ్రామ వ్యవసాయ సహాయకుల వారిచే షెడ్యూలింగ్ చేసే టెక్నికల్ సహాయకుని ద్వారా నమూనాలను సేకరించి 75.70 లక్షల గోనె సంచులను, 200 కుపైగా జీపీఎస్ పరికరం రవాణా వాహనం సమకూర్చటం జరిగిందన్నారు. ఫిర్యాదులు స్వీకరించేందుకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ నంబర్లు 08812- 230448, 7702003584, 7569562076, 7569597910 ఏర్పాటు చేశామని తెలిపారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు కామన్ రకం రూ2,183, గ్రేడ్-ఏ రకం రూ. 2,203లకు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

క్యాంపస్ సెలక్షన్లలో 81 మందికి ఉద్యోగాలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20 : హెటెరో డ్రగ్స్(విశాఖపట్నం)లో కెమిస్ట్ ఉద్యోగాల భర్తీకి శనివారం సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ జరిగింది. బీఎస్సీ, బీఫార్మసీ, ఎంఎస్సీ చదువుతున్న 139మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 81మందిని ఎంపిక చేశామని సంస్థ ప్రతినిదులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను సీఆర్‌ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, కరస్పాండెంట్లు డాక్టర్ విష్ణుమోహన్, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రామరాజు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు.

క్రైం వార్తలు

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 20 : పెదపాడు మండలం గుడిపాడుకు చెందిన గరికముక్కు రవిప్రసాద్(48) శనివారం ఉదయం ఏలూరు కొత్త బస్టాండ్ సమీపం లోని రైల్వే బ్రిడ్జిపైన పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీ ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే పోసులకు అందడంతో హెచ్‌సీ నంబూరి ఆదినారాయణ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఉంగుటూరు, ఏప్రిల్ 20 : జాతీయ రహదారిపై నాచుగుంట వద్ద లారీపై నుంచి అదుపుతప్పి అదే గ్రామానికి చెందిన ఆకుల సూర్యనారాయణ(36) పడి పోగా అతడి వీపు భాగం దెబ్బతింది. కుటుంబ సభ్యులు ఈనెల 19న ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 20 :ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒక మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. ఎస్ఐ జ్యోతిబస్ తెలిపిన వివరాలివి.. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో పట్టణానికి చెందిన పదేళ్ల బాలిక సోదరితో కలిసి చదువుకుంటోంది. ఈనెల 19న అంజత్ అనే 45 ఏళ్ల వ్యక్తి బాలిక తల్లి ఇంట్లో లేని సమయంలో ఇంటికి వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడన్నారు. బాలిక కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడన్నారు. ఈ విషయాన్ని స్థానిక మహిళ బాలిక తల్లికి తెలపడంతో ఆ తల్లి ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరుచోట్ల బీరు బాటిళ్లు కలిగిన ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం/పోలవరం, ఏప్రిల్ 20 : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒక వ్యక్తి బీరుబాటిళ్లు కల్గి ఉండడంతో ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు పవర్‌పేటకు చెందిన బొంగు నరేంద్రకుమార్ నాలుగు బీరు బాటిల్స్‌ను కల్గి ఏలూరు ఎన్ఆర్‌పేటలో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అరెస్టు చేసి బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలవరం మండలం ఎల్లండిపేట గ్రామంలో పది బీర్లు కలిగిన ఒక వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ పవన్‌కుమార్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన ఇళ్ళా నరసింహమూర్తి అనే వ్యక్తి పది బీర్లు కలిగి ఉండడంతో కేసు నమోదు చేశామన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 20 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లజామువరకు జిల్లాలో ని అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తనిఖీలు నిర్వహించారు. సారా, నగదు, మద్యం, గంజాయి రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. పలు నగరాలు, పట్టణాలు, పలు ప్రాంతాల్లో ఏటీఎంలు, మసీదులను పోలీసులు పరిశీలన చేశారు. జిల్లాలో నేరాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టారు.

రూ.4,01,000 నగదు సీజ్

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 18.2 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ రూ.5,170 అని శనివారం తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో నాలుగు లక్షల వెయ్యి రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పావుకేజీ బంగారం చోరీ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 20 : పావుకేజీ బంగారపు వస్తువులను జిప్ కల్గిన సూట్‌కేసులో పెట్టి బస్సులో ప్రయాణించి ఇంటికి వచ్చి చూసేసరికి బంగారపు వస్తువులు అపహరణకు గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన శనక్కాయల శేషసాయి తన కుటుంబంతో ఈనెల 17వ తేదీ రాత్రి హైదరాబాద్ నుంచి ఏలూరునకు ఒక బస్సులో ప్రయాణించాడు. 250 గ్రాముల బంగారపు వస్తువులను తమతో ఉన్న జిప్ సూట్‌కేసులో పెట్టి బస్సులో తమ సీటు వెనుకపక్క పెట్టారు. ఏలూరు బస్సుదిగి శనివారపుపేట బంధువుల ఇంటికి వెళ్లి సూట్‌కేసును తెరచి చూడగా బంగారపు వస్తువులు కనిపించలేదు. బస్సులో తమ వెనుక సీటు వాళ్లు విజయవాడలో దిగినట్టు గుర్తించారు. ఈఘటనపై శనివారం రాత్రి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు శేషసాయి ఫిర్యాదు చేయడంతో సీఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేస్తున్నారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 20 : తప్పుడు రిజిస్ట్రేషన్‌పై ముగ్గురు వ్యక్తులపై ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన కేశగాని వీరవెంకట సత్యమంగరూన్సీకి తన తాత బొల్లా వెంకన్న రెండు ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసియున్నారు. ఆమె బంధువులైన బొల్లా శ్రీలక్ష్మి, బొల్లా శివరామకృష్ణ, బొల్లా రమణి కలిసి ఏలూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. బాధితురాలు గుర్తించి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. బొల్లా శ్రీలక్ష్మి, శివరామకృష్ణ, రమణిలపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉన్నతాధికారులకు ఏపీటీఎఫ్ నాయకుల అభ్యర్థన

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20 : గతేడాది వేసవి సెలవుల్లో జరిగిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల విధులు నిర్వర్తించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ (ఫస్ట్ అసిస్టెంట్)లకు సంపాదిత సెలవు (ఈఎల్స్)లను సర్వీస్ రిజిస్టర్లలో నమోదు చేసేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని ఏపీటీఎఫ్ నాయకులు సాల్మన్‌రాజు, రామారావు తదితరులు అభ్యర్థించారు. శనివారం డీఈవో అబ్రహంను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారావును కలిసి టీచర్లకు సంబంధించిన పీఎఫ్ బ్యాలన్స్ షీట్లను విడుదలచేయాలని, లోన్లు మంజూరులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరారు. సంఘ నాయకులు ప్రకాష్, కొండయ్య, రామ్‌శేషుకుమార్, మూర్తి పాల్గొన్నారు.

రేపు 'పది' పరీక్షల ఫలితాలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానంద్‌రెడ్డి శనివారం ఓ పత్రికా ప్రకటనలో వెల్లడించారు. గతనెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగిన ఈ పరీక్షలకు ఏలూరు జిల్లాలో బాలురు 16,760మంది, బాలికలు 15,595మంది దరఖాస్తుచేసుకున్నారు. జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల ఏడునే ముగియగా, 16 లేదా 17వ తేదీల్లో ఫలితాలు వెల్లడిస్తారని తొలుత భావించారు. తాజాగా సోమవారం ప్రకటించాలని నిర్ణయించారు.

'ఆశ్రం'కు ఐఎస్‌వో అక్రిడిటేషన్

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 20 : ఆశ్రం ఆసుపత్రికి ఐదు విభాగాల్లో ఐఎస్‌వో అక్రిడిటేషన్ సాధించడం పట్ల ఆసుపత్రి డైరెక్టర్ రతీదేవి హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆశ్రం ఆసుపత్రిలో సిబ్బందితో కలసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాణ్యత, సమర్థత అత్యున్నత ప్రమాణాలను నిర్వహించడం ద్వారా ఐఎస్‌వో అక్రిడిటేషన్ సాధించామన్నారు. సిబ్బంది అంకిత భావంతో పని చేయడం వల్లే ఈ స్థాయికి చేరామన్నారు సీఈవో డాక్టర్ హనుమంతరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శాంతయ్య, రాజరాజన్, దనిష్ట బత్తుల, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఏంబీఏలో పెదపాడు విద్యార్థినికి గోల్డ్‌మెడల్



కె.ఫణిసీత

పెదపాడు, ఏప్రిల్ 20 : భువనేశ్వర్‌లోని ఎక్స్ఐఎం యూనివర్శిటీ నుంచి పెదపాడు గ్రామానికి చెందిన కాకరాల ఫణిసీత ఏంబీఏలో గోల్డ్‌మెడల్ సాధించింది. 2022-24 విద్యా సంవత్సరానికి గాను 'సుస్థిరత నిర్వహణ' అనే అంశంపై గోల్డ్‌మెడల్‌ను టాటా కెమికల్స్ సీఈవో అండ్ ఎండీ ఆర్.ముకుందన్, డీన్ ప్రొఫెసర్ డాక్టరు స్తుపాపాటి చేతుల మీదుగా యూనివర్శిటీలో జరిగిన కార్యక్రమంలో గోల్డ్‌మెడల్‌ను శనివారం అందుకున్నారు. గోల్డ్‌మెడల్‌తో పాటుగా వేదాంత గ్రూప్ ఆఫ్ ఇండియా సంస్థకు మేనేజ్‌మెంట్ ట్రైనీగా రూ.25 లక్షల వార్షిక వేతనానికి ఆఫర్ లెటరు అందుకున్నట్టు ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి ఉన్నత విద్యను అభ్యసించి జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్ సాధించిన ఆమెను మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులతో పాటు పలువురు అభినందించారు.

సీఆర్‌ఆర్ పీజీ కోర్సుల సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 20 : సీఆర్‌ఆర్ పీజీ (2023-24)కోర్సుల ప్రథమ, తృతీయ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శనివారం కళాశాల కరస్పాండెంట్లు డాక్టర్ విష్ణుమోహన్, శ్రీనివాసరావు విడుదల చేశారు. విద్యార్థులు తమ ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌నుంచి తెలుసుకోవచ్చని వివరించారు. టాపర్లను ప్రిన్సిపాల్ రామరాజు, పరీక్షల కంట్రోలర్ విశ్వేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ బాబు, ఆనందరావు, హేమలత అభినందించారు.

శ్రీవారి క్షేత్రంలో జోరుగా వివాహాలు



శ్రీహరి కళాతోరణ వేదిక వద్ద వివాహాలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 20: శ్రీవారి క్షేత్రంలో శనివారం రాత్రి వివాహాలు జోరుగా జరిగాయి. దీంతో క్షేత్రపరిసరాలు పెళ్లి జనంతో కళకళలాడాయి. చైత్రమాసంలో శనివారం మంచి ముహూర్తం కావడంతో పాటు మరో వారంలో ముహూర్తాలు లేకపోవడంతో ఈ ముహూర్తానికి పలు జంటలు మాంగల్యబంధంతో ఒక్కటయ్యాయి. వివాహం అనంతరం నూతన జంటలు, వారి బంధువులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.


నూజివీడు టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు


కైకలూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


ఆగిరిపల్లిలో..


బత్తులవారిగూడెంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

నూజివీడు, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను నూజివీడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారధి సతీమణి కమల లక్ష్మి, ఆయన కుమారుడు నితిన్ కృష్ణ కేక్‌ను కట్‌చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి సమానంగా ముందుకు తీసుకువెళ్ళగల సత్తా ఒక్క చంద్రబాబుకే ఉందన్నారు. నూజివీడు ఎమ్మెల్యేగా కొలుసు పార్థసారధిని గెలిపిస్తే నూజివీడులో అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు, రింగ్ రోడ్డు, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, మండల అధ్యక్షులు ముసునూరు రాజా, ఎస్సీసెల్ అధ్యక్షులు అరికోటి సంగీతరావు, తెలుగురైతు అధ్యక్షులు జగ్గవరపు వెంకటరెడ్డి, అక్కినేని చందు, బీజేపీ నాయకుడు బోనుఅప్పారావు తదితరులు పాల్గొన్నారు. బత్తులవారిగూడెంలో మండల టీడీపీ అధ్యక్షులు ముసునూరి రాజా కేక్‌ను కట్‌చేసి వేడుకలను ప్రారంభించారు. గ్రామ అధ్యక్షులు జి.పూర్ణచంద్రరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు మందాడ తిరుపతిరావు, టీడీపీ నాయకులు దాకారపు వెంకటరత్నం, వార్డుసభ్యులు కోటయ్య, దొండపాటి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: మండలంలోని గుడిపాడులో శనివారం తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గద్దె రఘుబాబు ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్‌ను చిన్నారులతో కట్ చేయించారు. కూటమి ప్రభుత్వం విజయం సాధించి, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలను ఇవ్వాలని నాయకులు కోరారు. నాయకులు కొల్లి గంగారామ్, మండలపు దర్మరాజు, మండలపు రాధాకృష్ణ, కొల్లి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే లోపూడిలో వేంపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

చాట్రాయి: మండలంలోని చనుబండలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోనే గొప్ప విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అన్నారు. చంద్రబాబు సీయంగా అధికారం చేపడితే భావితరాలకు బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందన్నారు. టీడీపీ నాయకులు ములగలపాటి శ్రీనివాసరావు, చీదిరాల మహేశ్వరరావు, మోరంపూడి రమేష్, నక్కా రాము, బొంతు సతీశ్, జక్కంపూడి ప్రదీప్, హరీష్, పరమేష్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండల టీడీపీ కార్యాలయంలో కూటమి నాయకులు కేక్ కట్ చేసి చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ నూజివీడు బీసీ సెల్ నాయకుడు ఆరేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భవించాకే బీసీ, ఎస్సీలకు సామాజిక న్యాయం జరిగిందన్నారు. జిల్లా రైతు నాయకుడు చిట్నేని శివరామకృష్ణ, దొండపాటి ఏసు, విక్టర్, నక్కనబోయిన వేణు, పలగాని శేఖర్, చాన్ బాషా, పామర్తి నర్సయ్య పాల్గొన్నారు.

కైకలూరు నియోజకవర్గంలో...

కైకలూరు, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు అభిమానుల కోలాహలం మధ్య ఘనంగా నిర్వహించారు. శనివారం కైకలూరు కోరుకొల్లు రోడ్డు సెంటర్లో తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించి వచ్చే ఏడాది చంద్రబాబు ముఖ్యమంత్రిగా పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటామని అభిమానులు అన్నారు. ప్రజలంతా కలిసికట్టుగా పనిచేసి ఎన్డీయే కూటమిని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కెకె బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ జానీ, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు గంగుల శ్రీదేవి, ఎస్సీ సెల్ నాయకులు వాసిపల్లి సతీష్‌కన్నా, వీరాబత్తిన సుధా, టీడీపీ నాయకులు లక్కింశెట్టి మోహన్, సయ్యద్ బాషిద్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పుట్టినరోజు సందర్భంగా మండవల్లి ఎన్డీయే కూటమి కార్యాలయంలో శనివారం కామినేని శ్రీనివాస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ముదినేపల్లి: చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలు ముదినేపల్లి మండలంలో శనివారం ఘనంగా జరిగాయి. టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ ఆధ్వర్యంలో ముదినేపల్లిలో నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంపిణీ చేయగా, బొమ్మినంపాడు దళితవాడలో జరిగిన వేడుకల్లో కొడాలి వినోద్ కేక్ కట్ చేశారు. సర్పంచ్ దారం సుధ, కూటమి నాయకులు పాల్గొన్నారు. అల్లూరులో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు దావు నాగరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. చంద్రబాబు బర్త్ డే వేడుకలు జరిగాయి. దాకరం, కాకరవాడల్లో జరిగిన వేడుకల్లో పార్టీ నాయకులు కొత్తూరి విఠల్, చలసాని జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: చంద్రబాబునాయుడు జన్మదినాన్ని సింగరాయపాలెంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యకర్తలకు కేక్‌లు పంపిణీ చేశారు.

కలిదిండి: భాస్కరరావుపేటలో జిల్లా తెలుగుయువత కార్యదర్శి వేగిరెడ్డి రవి కుమార్ ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కూటమి నాయకులు ఎం.రాంబాబు, డి.శరత్, ఎం.పరశురామ్, కె.శివ, ఎం.వెంకట్రావు, ఏడుకొండలు పాల్గొన్నారు. మట్టగుంటలో బీసీ సెల్ కార్యదర్శి అండ్రాజు శ్రీనివాస్ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.



గుడిపాడులో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు


చనుబండలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


బొమ్మినంపాడులో కేక్ కట్ చేస్తున్న కొడాలి వినోద్


భాస్కరరావుపేటలో కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు


'హోమ్' బాలికలతో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

అనాథ బాలికలతో వైసీపీ ప్రచారం

ఆర్వోకు జనసేన నాయకుడి ఫిర్యాదు

నూజివీడు, ఏప్రిల్ 20: ప్రభుత్వ నిధులతో అనాథ బాలికలకు నిర్వహిస్తున్న హోమ్ (హాస్టల్) విద్యార్థినులకు వైసీపీ కండువాలు కప్పి ఎన్నికల ప్రచారం నిర్వహించిన సంఘటన శుక్రవారం రాత్రి నూజివీడు మండలం పాతరావిచర్ల గ్రామంలో జరిగింది. నూజివీడు పట్టణంలో అనాథ బాలికలకు ప్రభుత్వ, ప్రైవేట్ నిధులతో వైసీపీ నాయకుడు బసవరాజు నగేష్ ఆధ్వర్యంలో ఒక హోమ్ నిర్వహిస్తున్నారు. ఈ హోమ్‌లో సుమారు 100 మంది బాలికలు వసతి పొందు తున్నారు. ఈ బాలికలు ఈ హోమ్‌లోని హాస్టల్లో భోజన, వసతి పొందుతూ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ విద్యనభ్యసిస్తుంటారు. పాత రావిచర్లకు గతంలో సర్పంచ్‌గా బసవరాజు నగేష్ పనిచేశారు. ప్రస్తుతం ఆయన భార్య సర్పంచ్‌గా ఉన్నారు. నగేష్ నూజివీడు ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి అయిన మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు వీర విధేయుడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి వైసీపీ అభ్యర్థి, పాతరావిచర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చారు. ఈ ప్రచారానికి నూజివీడు బాలికల హోమ్ నుంచి బసవరాజు నగేష్ బాలికలను వాహనం ద్వారా పాతరావిచర్ల గ్రామం తరలించి వారికి వైసీపీ కండువాలు కప్పి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేయించారు. హాస్టల్లో ఉన్న అనాథ బాలికలను ఇలా పార్టీ ప్రయోజనాలకు వినియోగించటం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయం ఆధారాలతో సహా బయటకు పొక్కడంతో నూజివీ డు జనసేన నాయకుడు ముత్యాల కామేష్ ఆధ్వర్యంలో నూజివీడు ఆర్డీవో, ఆర్వో అయిన వై.భవానీ శంకరికి లిఖితపూర్వక ఫిర్యాదు ఇచ్చి బసవరాజు నగేష్‌పై, వైసీపీ అభ్యర్థిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.


వలంటీర్లలో వైసీపీ నేతల సమావేశం

వలంటీర్ల రాజీనామాకు ఒత్తిడి?

కలిదిండి, ఏప్రిల్ 20 : మండలంలో వలంటీర్లతో శనివారం కలిదిండిలో వైసీపీ సమావేశాన్ని నిర్వహించారు. వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేసి వైసీపీ తరఫున పని చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఇప్పటికే కొంతమంది రాజీనామా చేశారు. మిగిలిన వారు కూడా త్వరితగతిన రాజీనామా చేయాలని వలంటీర్లపై కొందరు నేతలు ఒత్తిడి చేయటం చర్చనీయాంశమైంది. వైసీపీ మళ్లీ అధికారంలోకి రాగానే రాజీనామా చేసిన వలంటీర్లను విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. కొంత మంది వలంటీర్లు రాజీనామా చేయటానికి విముఖత చూపుతున్నారు. పలు గ్రామాల్లో వలంటీర్లు ఈ సమావేశానికి గైర్హాజరయ్యారని సమాచారం. వారిని కూడా భయపెట్టి రాజీనామా చేయించే యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఈ సమావేశంలో పాల్గొన్న వలంటీర్లపై ఎంపీడీఈవో దినతేజ్ విచారణ చేస్తున్నారు.

క్రైం కార్నర్

కరెంటు స్తంభంపై నుంచి పడి ఒకరి మృతి

ఆగిరిపల్లి, ఏప్రిల్ 20: మండలంలోని సగ్గూరు గ్రామంలో కల్లటూరు గ్రామానికి చెందిన కేబుల్ ఆపరేటర్ కాటూరి రాజు (35) కరెంటు స్తంభానికి కేబుల్ వైరు ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి స్తంభంపై నుంచి కిందపడిపోయాడు. స్థానికులు అతనిని అంబులెన్స్‌లో నూజివీడు అమెరికన్ ఆస్పత్రికి తరలించగా అతను చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

ముసునూరు, ఏప్రిల్ 20: వలసపల్లి ప్రధాన రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్ర గాయాలపాలయ్యారు. ఎస్ఐ పి. వాసు వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా జి-కొండూరు మండలం కట్టుబడిపాలెంకు చెందిన కటికల సీతారామయ్య, భార్య కుమారి స్కూటీపై ముసునూరు వైపు వస్తున్న క్రమంలో ముసునూరు నుంచి చింతలపూడి వైపు వెళ్తున్న లారీ స్కూటీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో గాయపడిన భార్యా భర్తలిద్దరినీ విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. లారీకి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందన్నారు.


అయ్యవారి రుద్రవరంలో కామినేనికి హారతులు


కైకలూరులో కామినేని కుటుంబీకులు, నాయకుల ప్రచారం

కూటమితోనే ఆక్వా రైతులకు మేలు : కామినేని

మండవల్లి, ఏప్రిల్ 20: వైసీపీ నాయకుల మాటలు నమ్మి ఓటు వేయవద్దని ఇప్పటికే రైతుల భూములను దొడ్డిదారిన తాకట్టుపెట్టి దోచుకునేందుకు వైసీపీ నేతలు యత్నిస్తున్నారని తస్మాత్ జాగ్రత్త అంటూ కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండవల్లి మండలంలోని పలు గ్రామాల్లో కామినేని శనివారం ప్రచారం నిర్వహించి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామాల్లో భారీ ఎత్తున కామినేనికి పూలవర్షంతో స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ రైతులను ఇబ్బందిపాలు చేసిన వైసీపీకి ఎన్నికల్లో గుణపాఠం చెపాలన్నారు. ఆక్వా రైతులను ఇబ్బంది పాలుచేసిన జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని కోరారు. కూటమి అధికారంలోకి వస్తే ఆక్వా రైతులకు మేలు జరుగుతుందన్నారు. కూటమి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పుట్లచెరువులో 50 కుటుంబాల చేరిక...

మండవల్లి మండలం పుట్ల చెరువు గ్రామంలో 50 కుటుంబాలు వైసీపీకి గుడ్‌బై చెప్పాయి. ఆగస్టు వెంకటేశ్వరరావు, చింతాడ సీతారామయ్య, గూడూరి శ్రీనివాస్ మరో 50 కుటుంబాలు శనివారం కామినేని, టీడీపీ నాయకుడు, గుడివాడ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జి సమక్షంలో కూటమిలో చేరగా కామినేని శ్రీనివాస్, పిన్నమనేని బాబ్జి వారికి కండువాలు కప్పి కూటమిలోకి ఆహ్వానించారు. కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తరపున మండవల్లి మండలం అయ్యవారిరుద్రవరం, మండవల్లి గ్రామాల్లో కామినేని కుటుంబ సభ్యులు ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. కామినేనికి కమలం గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌కు సైకిల్‌గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. కామినేని శ్రీనివాస్ తరపున చిరంజీవి ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామినాయుడు శనివారం మండవల్లి మండలం పుట్లచెరువు, చింతలపూడి గ్రామాల్లో కామినేనికి మద్దతు తెలుపుతూ ఓట్లను అభ్యర్థించారు.

కామినేని సతీమణి ప్రచారం..

కైకలూరు: కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌ను గెలిపించాలని ఆయన సతీమణి మనోరమ ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. శనివారం కైకలూరు మండలం వేమవరప్పాడు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కామినేనికి కమలం గుర్తుపై, పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌కు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అలాగే కైకలూరు 6, 7, 8వ వార్డుల్లో కామినేని కుటుంబ సభ్యులైన కామినేని దీప, యడ్లపాటి పద్మజ కరపత్రాలను పంపిణీ చేసి ఓట్లను అభ్యర్థించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మి, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.


కొత్త ఈదరలో నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథికి హారతులు

గ్రామాభివృద్ధి శూన్యం : పార్థసారథి

ముసునూరు, ఏప్రిల్ 20: వైసీపీ ఐదేళ్ళ పాలనలో గ్రామీణా ప్రాంతాల అభివృద్ధి శూన్యమని నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారధి అన్నారు. శనివారం చిల్లబోయినపల్లిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించగా, టీడీపీ శ్రేణులు పార్థసారథికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో గ్రామీణా ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు. వైసీపీ ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కేంద్రం నుంచి వచ్చిన ఆర్థిక సంఘాల నిధులను సైతం కైంకర్యం చేసి, సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మార్చి, ప్రజలకు కనీస మౌళిక సదుపాయాలను కల్పించలేని పరిస్థితులను తీసుకు వచ్చిందన్నారు. జగన్ పాలనలో విధ్వంసం, అరాచకం, అప్పులు తప్ప అభివృద్ధి లేదని ఆయన విమర్శించారు. దొరల పాలనకు చరమగీతం పాడి నూజివీడులో టీడీపీ జెండాను ఎగురవేసేలా ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఓటు వేయాలని కోరారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేశారు. వైసీపీ నాయకుడు బళ్ళా నాగరాజు టీడీపీలో చేరగా సారథి కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ కండేపు రామగిరి మూడు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండలం కొత్త ఈదర గ్రామంలో నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకుని పార్టీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు చదువు పూర్తి చేసి వచ్చాక ఈ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించటం లేదని విద్యార్థులే వారికి ఓటుద్వారా తగిన బుద్ధిచెప్తారని అన్నారు.


కనుమూరి బాపిరాజు

వాళ్లిద్దరికీ మధ్యంతరంగా..

మంత్రి పదవి పోయింది


కామినేని శ్రీనివాస్

» అవినీతి ఆరోపణలతో కనుమూరి బాపిరాజు » పొత్తు విఫలమై కామినేని శ్రీనివాస్

» కైకలూరు నియోజకవర్గానికి రెండు పర్యాయాలు మంత్రి పదవులు.. రెండు సార్లూ పదవి కోల్పోయారు

ఎన్నికల స్నాప్

ఎన్నికల్లో ప్రజల తీర్పుతో గెలుపోటములు సాధారణం.. గెలిచిన తర్వాత వచ్చే పదవులు పార్టీ నిర్ణయమే. కైకలూరు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు కేవలం రెండు పర్యాయాలు ఇక్కడి ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు దక్కాయి. అయిదే రెండు మార్లు కూడా ఆ మంత్రులు పదవీకాలం పూర్తి కాకముందే పదవులకు రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కైకలూరు నియోజకవర్గంలో ఒకరు అవినీతి ఆరోపణలు ఎదుర్కొగా మరొకరు పొత్తులు విడిపోవడంతో తమ మంత్రి పదవులను కోల్పోవలసి వచ్చింది. కైకలూరు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా రాజకీయ ప్రవేశం చేసిన కనుమూరి బాపిరాజు 1978లో కైకలూరు అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందారు. ఆయన మరో మూడు పర్యాయాలు కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలుపొందారు. 1983లో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధికారాన్ని చేజిక్కుంచుకున్న ఇక్కడ కనుమూరి బాపిరాజు కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందారు. 1985, 1989లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ తరపున కనుమూరి బాపిరాజు గెలుపొందారు. 1989లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌పార్టీ అధికారం చేజిక్కుచుకుంది. ఆ సమయంలో ముగ్గురు ముఖ్యమంత్రులు రాష్ట్రాన్ని పరిపాలించారు. మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి, నేదురుమల్లి జనార్ధనరెడ్డి ముఖ్యమంత్రులుగా కొనసాగారు. కైకలూరు నుంచి కనుమూరి బాపిరాజుకు మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి పదవి చేపట్టారు. తర్వాత కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రి కావడంతో కనుమూరి ఎక్సైజ్ శాఖ మంత్రిగా పదవి చేపట్టారు. ఆయనపై డిస్లరీల కుంభకోణం ఆరోపణలతో మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవీకి 1992లో రాజీనామా చేశారు. అనంతరం 1993లో జరిగిన ఉప ఎన్నికల్లో బాపిరాజుకు అసెంబ్లీ టిక్కెట్టు రాకపోవడంతో కైకలూరులో కనుమూరి రాజకీయ జీవితం కనుమరుగైంది.

తర్వాత జరిగిన ఎన్నికల్లో ఒకసారి స్వతంత్ర అభ్యర్థి గెలుపొందగా మిగిలిన అన్నిసార్లు గెలిచిన అభ్యర్థులు ప్రతిపక్షానికే పరిమితమయ్యారు. 2014లో రాష్ట్ర విభజనతో తెలుగుదేశం, బీజేపీ పొత్తులో భాగంగా కైకలూరు నుంచి బీజేపీ అభ్యర్థిగా కామినేని శ్రీనివాస్ గెలుపొందారు. చంద్రబాబు ప్రభుత్వంలో కామినేని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. మూడున్నర సంవత్సరాల కాలం పాటు మంత్రి పదవిలో కొనసాగారు. చంద్రబాబు ఎన్డీఏ కూటమి నుంచి వైదొలగడంతో కామినేని తన మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

-కైకలూరు

23న కామినేని నామినేషన్‌కు తరలిరావాలి

కలిదిండి, ఏప్రిల్ 20 : కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ ఈ నెల 23న నామినేషన్ వేస్తున్నారని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు పిలుపునిచ్చారు. శనివారం కలిదిండిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 23 పంచాయతీల్లో నాయకులు, కార్యకర్తలు సుమారు 1100 బైకులపై ర్యాలీగా కైకలూరు తరలిరావాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, తాడినాడ బాబు, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, నాయకులు పాల్గొన్నారు.

మే 6లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 20: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బీఏ, బికాం, బీఎస్సీ ఓపెన్ డిగ్రీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజును మే నెల 6వ తేదీలోపు చెల్లించాలని నూజివీడు డీఏఆర్ కళాశాల ప్రిన్సిపల్ వి.కృష్ణకుమార్ తెలిపారు. పరీక్షలకు సంబంధించి రిజిస్ట్రేషన్, ఫీజుల చెల్లింపులు, ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉందని, 1వ సెమిస్టర్ పరీక్షలు మే 26వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయని, హాల్ టిక్కెట్లు యూనివర్శిటీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ఇతర వివరాలకు లెర్నింగ్ సపోర్ట్ సెంటర్ సెల్ నెంబర్ 73829 29686కి కాల్‌చేయాలన్నారు.

ఉపాధి పనుల్లో నిబంధనలు పాటించాలి

ముసునూరు, ఏప్రిల్ 20: ఉపాధి పనుల్లో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో సీహెచ్.పద్మావతిదేవి అన్నారు. శనివారం బలివే, వేల్పుచర్ల గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల మస్తరు రికార్డుతోపాటు పనుల్లో నాణ్యతను ఆమె తనిఖీ చేశారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. వేసవి దృష్ట్యా కూలీలకు సదుపాయాలు కల్పించాలన్నారు. ఏపీవో రోజ్‌లీల, ఈసీ జయప్రసాద్, టీఏలు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

నూజివీడు టౌన్, ఏప్రిల్ 20: అగ్నిప్రమాదాలు జరగకుండా మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలని నూజివీడు ఫైర్ ఆఫీసర్ విశ్వనాథ్ అన్నారు. నూజివీడు ఫైర్‌స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మహిళా సంఘాలకు అగ్నిప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించారు. రాత్రిపూట గ్యాస్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలని సూచించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఆగిరిపల్లి, ఏప్రిల్ 20: బాలల సంరక్షణ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విజయవాడకు చెందిన వాసవ్య మహిళా మండలి ఉపాధ్యక్షురాలు, ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ కౌన్సిలర్ శ్రీమతి కె.విజయ అన్నారు. మండలంలోని హీల్ బాలల ఆశ్రమంలో బాలలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012, పోక్సోచట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. బ్యాడ్ టచ్, బాలికలను శారీరక లేదా మానసిక హింసకు గురిచేయటం, బాల్యవివాహాలు మొదలైన నేరాలు అన్నింటికి పోక్సోచట్టం ప్రకారం కఠినమైన శిక్షలు ఉంటాయని వివరించారు. హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, అజయ్‌కుమార్, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎం వెంకటేశ్వరరావు మృతి



ముదినేపల్లి, ఏప్రిల్ 20 : ఆదర్శ ఉపాధ్యాయుడిగా పేరొందిన రిటైర్డ్ ప్రధానో పాధ్యాయుడు గూడవల్లి వెంకటేశ్వరరావు శనివారం గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ముదినేపల్లికి చెందిన ఆయన పామర్రు, అడ్డాడ జడ్పీ హైస్కూళ్లలో ఉపాధ్యాయుడిగా పని చేసి ముదినేపల్లి, పెదగొన్నూరు హైస్కూళ్లలో హెచ్‌ఎంగా పని చేశారు. పలుసార్లు ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డులు పొందారు. ఆయన మృతి పట్ల మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్, టీడీపీ నాయకులు కొడాలి వినోద్, డాక్టర్ ఈడ్పుగంటి శ్రీనివాస్, ఈడే సుధాకర్, రిటైర్డ్ పంచాయతీ ఈవో అడుసుమిల్లి రాజేంద్ర ప్రసాద్ తదితరులు సంతాపం తెలిపారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 20: రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు నూజివీడులో హోరాహోరీగా సాగుతున్నాయి. 9వ జూనియర్ బాలుర, బాలికల రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను శుక్రవారం రాత్రి ప్రారంభించగా, శనివారం నిర్వహించిన పోటీల్లో బాలికల విభాగంలో తూర్పుగోదావరి, కడప జట్ల మధ్య పోటీ జరగ్గా కడపపై తూర్పుగోదావరి విజయం సాధించింది. ఇక రెండో మ్యాచ్ అనంతపురం, గుంటూరు జట్ల మధ్య జరగ్గా అనంతపురం విజయం సాధించింది. మూడో మ్యాచ్ కృష్ణా, చిత్తూరు జట్ల మధ్య జరగగా కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించింది. బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, కడప జిల్లా జట్లు పోటీపడగా పశ్చిమగోదావరి విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో విశాఖపట్నం, విజయనగరం జట్లు పోటీపడగా విశాఖపట్నం, నెల్లూరు, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన పోటీలో నెల్లూరు జట్టు విజయం సాధించింది.

వాహనాల విస్తృత తనిఖీ

ముదినేపల్లి, ఏప్రిల్ 20 : ఎన్నికల నేపథ్యంలో ముదినేపల్లి ప్రాంతంలో వాహనాల తనిఖీ విస్తృతంగా జరుగుతోంది. పోలీసు అధికారులతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్, క్లస్టర్ అధికారులు, ఇతర సిబ్బంది పామర్రు - దిగమర్రు జాతీయ రహదారితోపాటు, ముదినేపల్లి - బంటుమిల్లి, గుడ్లవల్లేరు ప్రధాన రహదారులలో వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఏలూరు జిల్లా సరిహద్దులో ముదినేపల్లి మండలం పెదపాలపర్రు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి చెక్ పోస్టు వద్ద ఇప్పటి వరకు 4 వేలకు పైగా వాహనాలు తనిఖీ చేసినట్లు చెక్‌పోస్టు అధికారి, మండల పరిషత్ ఏవో రమణబాబు తెలిపారు. నామినేషన్ల ఘట్టం ప్రారంభమైనందున వాహనాల తనిఖీ మరింత పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలిపారు.